**TELTEL/2015/66279**

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :267 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 01-01-2025 | పేజీలు:4 వెల: 2.00

## బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం.. తల్లి చెంతకు బిడ్డ

తాండూరు:తాండూరు మండలం గౌతాపూర్ గ్రామంలో ఏడాది బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. పోలీసుల సహాయంతో బాలుడు తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నాడు. కరణ్ కోట్ పోలీసులు 24 గంటల్లోనే బాలుడు ఆచూకీని కనిపెట్టారు. కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్ ప్రాంతానికి చెందిన భాష భార్య గోరీబీ, ముగ్గురు కుమారులు, అత్త, మరదలుతో కలిసి గౌతాపూర్ గ్రామంలో పనులు చేసుకునేందుకు వలస వచ్చాడు. గ్రామంలోని మల్లన్న స్వామి దేవాలయం వద్ద ఉంటు గ్రామంలో గ్యాస్ స్టవ్, మిక్సీ రిపేర్ల పనులు చేసుకునేవాడు. అయితే ఆదివారం రాత్రి అందరు పడుకున్నారు. సోమవారం తెల్లవారు జామున వారి ఏడాది కుమారుడు హుస్సేన్‌ను కనిపించలేదు.దీంతో బాలుడును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని వదంతులు రాగా ఎస్ఐ విఠల్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాలుడు ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసుకున్న 24 గంటల్లోనే పోలీసులు బాలుడు ఆచూకీని కనిపెట్టారు. వికారాబాద్ జిల్లా బంటారం మండలంలో బాలుడిని గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌లో బాలుడును తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే బాలుడును ఎత్తుకెళ్లిన నిందితులను కూడా పోలీసులు అదుపులోకి

## భగీరథమ్మ చెరువులో నిర్మాణాల కూల్చివేస్తున్న హైడ్రా



హైదరాబాద్: నగరంలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఖాజాగూడ భగీరథమ్మ చెరువు బఫర్‌జోన్‌లోని నిర్మాణాలకు కూల్చివేశారు. ఈ సందర్భంగా భారీగా పోలీసులను మోహరించారు. ఇటీవల ఈ చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు.కాగా, భగీరథమ్మ చెరువు నానక్‌రామ్ గూడ సర్వే నంబర్ 150, 151లో, రాజేంద్రనగర్ మండలం పుప్పాలగూడ సర్వే నంబర్ 450, 451లో సుమారు 54 ఎకరాల్లో విస్తరించి ఉంది. రెండు మండలాల పరిధిలోని నానక్‌రామ్ గూడ, ఖాజాగూడ, పుప్పాలగూడ గ్రామాల్లో చెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ విస్తరించి ఉంది. 2013లో ఇరిగేషన్ అధికారులు నిర్ణయించిన హద్దుల ప్రకారం ఈ చెరువు (లేక్ ఐడీ 2924) మొత్తం 54 ఎకరాల్లో ఉండగా, అందులో 2013 అక్టోబర్ నాటికి 48 ఎకరాల మేర నీరు ఉన్నట్లు గుర్తించి ఇరిగేషన్ నార్త్ ట్యాంక్ అధికారుల మ్యాప్ తయారు చేశారు. అయితే గత కొంతకాలంగా విచ్చలవిడిగా కబ్జాలు చోటుచేసుకుంటున్నాయి. చెరువును ఎండబెట్టి మరీ శిఖం కబ్జా వంటి ఆరోపణలు ఉన్నాయి.

## కేరళ మినీ పాకిస్థాన్.. అందుకే రాహుల్, ప్రియాంక గెలుపు..



ముంబై:మహారాష్ట్ర మంత్రి రాణే నోరు పారేసుకున్నారు.కేరళ రాష్ట్రాన్ని పాకిస్తాన్‌తో పోల్చడమే కాకుండా అక్కడి ప్రజలను ఉగ్రవాదులతో పోల్చారు. అందుకే రాహుల్, ప్రియాంక్ ఇద్దరు గెలిచారని వివాదస్పద వ్యాఖ్యలు చేశారు.మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత నితేశ్ రాణే నోరుజారి వివాదంలో చిక్కుకున్నారు. కేరళను మినీ పాకిస్థాన్‌గా అభివర్ణించిన ఆయన.. అక్కడ ప్రజలను, ఓటర్లను ఉగ్రవాదులతో పోల్చారు. అందుకే రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీలు ఎంపీలు గెలిచారని అన్నారు. ఔరంగజేబు సేనాని అఫ్జల్‌ఖాన్‌పై ఛత్రపతి శివాజీ మహరాజ్ చారిత్రక విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని ముంబయిలో సోమవారం ఓ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర మత్స్య శాఖ మంత్రి నితీశ్ రాణే చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం మొదలైంది.నితేశ్ రాణే మాట్లాడుతూ.. "కేరళ మినీ పాకిస్థాన్‌కు ఏమాత్రం తీసిపోదు. అందువల్లే అక్కడ రాహుల్, ఆయన సోదరి గెలిచారు. ఉగ్రవాదులంతా వారికి ఓటేశారు. నేను నిజమే చెబుతున్నాను. టెర్రరిస్టుల మద్దతు వల్లే వాళ్లిద్దరూ ఎంపీలయ్యారు" అని రాణే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2019 ఎన్నికల్లో అమేథీ, వయనాడ్ నుంచి పోటీచేసిన రాహుల్ గాంధీ.. వయనాడ్‌లో గెలిచారు. ఈసారి ఎన్నికల్లో వయనాడ్, రాయబరేలిలో పోటీచేసిన రాహుల్ రెండు చోట్ల విజయాన్నిఅందుకున్నారు. అయితే, వయనాడ్ స్థానానికి ఆయన రాజీనామా చేయడంతో అక్కడ జరిగిన ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ వాద్రా గెలిచి అఖండ విజయాన్ని అందుకున్నారు. అయితే, రాణే వ్యాఖ్యలపై కాంగ్రెస్, ఎన్సీపీ , శివసేన సహా ప్రముఖ జర్నలిస్ రాజ్‌దీప్ సర్దేశాయ్ విమర్శలు చేశారు. ఇలాంటి వాళ్లు అసెంబ్లీలో జైల్లో ఉండాలని రాజ్‌దీప్ సోషల్‌మీడియా వేదికగా ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేర్ మాట్లాడుతూ.. 'వచ్చే ఎన్నికల్లో కేరళ నుంచి బీజేపీ పోటీ చేస్తుందో లేదో మీ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను అడిగి తెలుసుకోండి. రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం బీజేపీ నేతలకు అలవాటుగా మారిపోయింది' అని మండిపడ్డారు. ఇక, రాణే వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుంటారో లేదో చెప్పాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఎన్సీపీ (ఎస్పీ) నిలదీసింది. మోదీ మెజార్టీ లక్షకు పడిపోవడంతో ఆందోళన చెందుతున్న బీజేపీ నేతలు.. వయనాడ్‌లో ప్రియాంక గాంధీ గెలుపును జీర్ణించుకోలేకపోతున్నారని శివసేన (యూబీటీ) ఆగ్రహం వ్యక్తం చేసింది.ఆయన్ను ఇంకా మంత్రి పదవిలో ఎందుకు కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అతుల్ లోంధే పాటిల్ మండిపడ్డారు. 'భారత సార్వభౌమాధికారం, ఐక్యతను కాపాడే రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఓ వ్యక్తి,..అది మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి దేశంలోని ఓ రాష్ట్రాన్ని పాకిస్థాన్‌గా.. ప్రజలను ఉగ్రవాదులతో పోల్చారు. ఇంకా ఆయనకు మంత్రిపదవిలో ఉండడానికి అర్హుడేనా అంటూ ప్రశ్నించారు.కాగా, తన వ్యాఖ్యలపై మంత్రి స్పష్టత ఇచ్చారు. ఆయన ఏఎన్ఐతో మాట్లాడుతూ.. 'మనది హిందూ దేశంగానే ఉండాలి.. అన్ని విధాలుగానూ హిందువులను కాపాడుకోవాలి. భారత్‌లో కేరళ ముఖ్య రాష్ట్రం. అయితే, అక్కడ హిందూ జనాభా తగ్గడం ఆందోళన కలిగిస్తుంది. హిందువులను ముస్లింలు, క్రైస్తవులుగా మార్చుతున్నారు. అందుకే కేరళను నేను పాకిస్థాన్‌తో సరిపోల్చాను. పాక్‌లోని హిందువుల మాదిరిగానే కేరళలో పరిస్థితి ఉంది.. దీనిపై చర్యలు తీసుకోవాలి.. నేను నా ప్రసంగంలో ఇదే చెప్పానని తెలిపారు.


## త్వరలో అధ్యక్షుడి ఎన్నిక.. వారసులెవరు?

హైదరాబాద్,బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోందా? అంతర్గత కుమ్మలాటలు తారాస్థాయికి చేరాయా? పార్టీలు పగ్గాలు అందుకునేందుకు వారసుల మధ్య పోటీ తీవ్రమవుతుందా? మార్చిలోపు బీఆర్ఎస్‌కు కొత్త అధ్యక్షుడు రాబోతున్నారా? కేటీఆర్ వర్సెస్ కవిత మధ్య పోటీ ఉంటుందా? ఈ వ్యవహారంలో పార్టీ నేతలు రెండుగా చీలిపోయారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణలో అధికారం పోయిన తర్వాత ఫామ్‌హౌస్‌కి పరిమితమయ్యారు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. పార్టీలో ఆయన ఏమాత్రం యాక్టివ్‌గా లేరు. అవసరమను కుంటే తన ఇంటికి నేతలను రప్పించుకుంటున్నారు. వయస్సు రీత్యా రాజకీయాలకు దూరంగా ఉండాలని పెద్దాయన నిర్ణయించుకున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.అందుకే ఫామ్‌హౌస్ దాటి కేసీఆర్ బయటకు రాలేదనే వాదన లేకపోలేదు. ఇదే క్రమంలో పార్టీ పగ్గాల కోసం వారసుల మధ్య పోటీ షురూ అయ్యింది. కొద్దిరోజులుగా బీఆర్ఎస్‌లో దీనిపై చర్చ తీవ్రమైంది. ఎన్నికలు గడిచి ఏడాది అయినా, పార్టీలో ఇంకా ప్రక్షాళన జరగలేదు.. వివిధ విభాగాలకు నేతలను నియమించలేదు. ఇలాగైతే కేడర్ వలసపోవడం ఖాయమనే టాక్ ఆ పార్టీలో జోరుగా నడుస్తోంది.సోమవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు కేటీఆర్. ఈక్రమంలో కొన్ని విషయాలు బయటపెట్టారు. సమయం వచ్చినప్పుడు మాత్రమే కేసీఆర్ బయటకు వస్తారని అన్నారు. తెలంగాణ కోసం రెండున్నర దశాబ్దాలపాటు పలుపెరగని పోరాటం చేశారని, ఇప్పుడు రెస్ట్ తీసుకోవడంలో తప్పేముందన్నది ఆయన మాట.దీనికితోడు మరో మాట వెల్లడించారు. 2025లో పార్టీ తరపున అనేక కార్యక్రమాలు చేపట్టబోతున్నమని, పనిలోపనిగా పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ చేపడతామని చెప్పకనే చెప్పేశారు. పార్టీని విజయం వైపు నడిపించేందుకు కేడర్‌ను సిద్ధం చేస్తామన్నారు. స్వయంగా కేటీఆర్ నుంచి వెలువడిన




మాటలు.అంతర్గతం ఏం జరిగిందనేది ఒక్కసారి లోతుల్లోకి వెళ్దాం. పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు.. కేటీఆర్ చిట్‌చాట్ మాటల ముందు పార్టీకి పగ్గాల వ్యవహారంపై అధినేత కేసీఆర్ ఇంట్లో సుదీర్ఘ చర్చలు జరిగాయట. కవిత పార్టీకి కాబోయే అధ్యక్షురాలని తన సన్నిహితుల వద్ద కేసీఆర్ చెప్పారట. ఆ మరుసటిరోజు కేటీఆర్ చిట్‌చాట్‌లో ఈ వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది.పార్టీ పగ్గాల కోసం వారసుల మధ్య కుమ్మలాట మొదలైందన్న చర్చ తెలంగాణ వ్యాప్తంగా మొదలైంది. ఈ క్రమంలో కవిత యాక్టివ్ అయ్యారన్నది నేతల మాట. అధ్యక్షుడి ఎన్నికలో విజయం సాధించేందుకు కేటీఆర్-కవిత ఎవరికి వారే తమతమ ప్రయత్నాలు చేస్తున్నారట.ఎవరు గెలిచినా పార్టీలో హరీష్‌రావు రోలేంటి అన్నదే అసలు ప్రశ్న. ఉద్యమం సమయంలో కేసీఆర్‌కు వెన్నంటి నడిచినట్టుగానే హరీష్‌రావు.. కాబోయే అధ్యక్షుడికి చేదోడు వాదోడుగా వుంటారా? లేదా? అనేది మరోవైపు ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల నాటికి ఇంకెన్ని అంశాలు వెలుగులోకి వస్తాయో చూడాలి.

## రక్షణ ఎగుమతులు 21 వేల కోట్లు: రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ,భారత రక్షణ ఎగుమతులు దశాబ్దం క్రితం కేవలం రూ.2,000 కోట్ల నుంచి ఇప్పుడు రూ.21,000 కోట్లకు పైగా చేరుకున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.సోమవారం ఆర్మీ వార్ కాలేజీ లో అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 2029 నాటికి భారత రక్షణ ఎగుమతుల లక్ష్యం రూ.50,000 కోట్లుగా నిర్దేశించిందని ప్రకటించారు.ఇన్ఫర్మేషన్ వార్‌ఫేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ఆధారిత వార్‌ఫేర్, ప్రాక్సీ వార్‌ఫేర్, ఎలక్ట్రోమాగ్నెటిక్ వార్‌ఫేర్, స్పేస్ వార్‌ఫేర్ మరియు సైబర్-దాడుల వంటి సాంప్రదాయేతర పద్ధతులతో యుద్ధంలో తీవ్రమైన మార్పులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.ఈ సవాళ్లను ఎదుర్కొనడానికి సైన్యం సుశిక్షితమై, సన్నద్ధం కావాల్సిన అవసరాన్ని రాజ్‌నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. శిక్షణా కేంద్రాలు ఈ మార్పులకు తగిన విధంగా తమ శిక్షణ పథ్యాంశాలను మెరుగుపరుస్తున్నందుకు ఆయన ప్రశంసలు తెలిపారు.అలాగే, రక్షణ మంత్రి శిక్షణా కేంద్రాలను మిలిటరీ కాలేజ్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ లో AI మరియు కమ్యూనికేషన్ టెక్నాలజీ, మరియు AWCలో నాయకత్వం శిక్షణ ద్వారా ఏకీకరణ మరియు ఉమ్మడిని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు.ప్రభుత్వం మూడు రక్షణ సేవల మధ్య ఏకీకరణను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. "రాబోయే కాలంలో, సాయుధ దళాలు మరింత సమర్థవంతంగా సవాళ్లను ఎదుర్కొనగలవు" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.భవిష్యత్తులో కొన్ని అధికారులు డిఫెన్స్ అటాచ్‌లుగా పనిచేస్తారని, వారు ప్రపంచ స్థాయిలో భారతదేశం యొక్క జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు."ఆత్మనిర్భర్ భారత్" మంత్రిత్వాన్ని ప్రతిపాదిస్తూ, రక్షణ మంత్రి స్వావలంబన ద్వారా మాత్రమే భారతదేశం తన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుని ప్రపంచ వేదికపై గౌరవం పొందగలదని చెప్పారు.రక్షణ మంత్రి, భద్రతపై పూర్తి శ్రద్ధ పెట్టడం ద్వారా ఆర్థిక శ్రేయస్సు సాధ్యం అవుతుందని, అలాగే బలమైన ఆర్థిక వ్యవస్థ ద్వారా భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చని అన్నారు.సరిహద్దుల భద్రతలో సాయుధ బలగాల పాత్రను ఆయన ప్రశంసించారు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా వీరు ప్రతిస్పందనగా నిలిచారని చెప్పారు.AWC కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ HS సాహి గారి ద్వారా సైనిక నాయకత్వం మరియు శిక్షణా కేంద్రాల పాత్ర గురించి వివరణ ఇచ్చారు.ముఖ్యంగా, బహుళ-డొమైన్ కార్యకలాపాలలో ఉమ్మడిగా ఉండడం, శిక్షణా పాఠ్యాంశాల్లో సాంకేతికతను సమగ్రంగా చేర్చడం మరియు CAPF అధికారుల శిక్షణతో పాటు విద్యా సంస్థలు, పరిశ్రమలతో మార్పిడి కార్యక్రమాలను రక్షణ మంత్రి వివరించారు.స్నేహపూర్వక దేశాలకు శిక్షణ ఇవ్వడం మరియు సైనిక దౌత్యంలో విపరీతమైన సహకారాన్ని అందించడం ద్వారా భారత సైన్యం యొక్క ప్రపంచ పాదముద్రలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మరియు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.రక్షణ మంత్రి పదాతిదళ స్మారక స్థలంలో ధైర్యవంతులైన సైనికులకు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

### డిప్యూటీ మేయర్ కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

వరంగల్ /కరీమాబాద్ :వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీం మసూద్ కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ పరామర్శించారు.. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మాసూద్ సోదరుడు సయ్యద్ మహమ్మద్ అనారోగ్యం తో హైదరాబాదులోని యశోద హాస్పిటల్ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలియగానే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే నరేందర్ డిప్యూటీ మేయర్ నివాసానికి వెళ్లి సయ్యద్ మహమూద్ పార్థివా దేహానికి నివాళులు అర్పించి

## అప్పుల కుప్ప రాష్ట్రానికి సంపన్న సీఎం.. జాబితాలో టాప్



అమరావతి,ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికర గుర్తింపును పొందారు. తాజాగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) రిపోర్టు ప్రకారం దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా నిలిచినట్లుగా పేర్కొంది. ఆయన కుటుంబానికి రూ.931 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లుగా తెలిపింది. అదే సమయంలో చంద్రబాబుకు రూ.10కోట్ల అప్పు ఉన్నట్లుగా పేర్కొంది. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. అప్పుల కుప్పలా మారిన ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు.. అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా అగ్రస్థానాన్ని సొంతం చేసుకోవటంగా చెప్పాలి.అదే సమయంలో దేశంలో అత్యంత తక్కువ ఆస్తులు ఉన్న ముఖ్యమంత్రిగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అలియాస్ దీదీ నిలిచారు. ఆమె వద్ద రూ.15 లక్షల ఆస్తే ఉన్నట్లుగా రిపోర్టు వెల్లడించింది. మొత్తం కేంద్ర పాలిత ప్రాంతాలు.. రాష్ట్రాల ముఖ్యమంత్రుల సగటు సంపదను రూ.52.59 కోట్లుగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. అదే సమయంలో ముఖ్యమంత్రుల సగటు వ్యక్తిగత ఆదాయం రూ.13,64,310గా పేర్కొంది.ఈ రిపోర్టు ప్రకారం చూస్తే దేశంలోని మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల సంపద రూ.1630కోట్లు. ఇక.. జాబితాలో టాప్ పొజిషన్ లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిస్తే.. రెండో స్థానంలో అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమాఖండు నిలిచారు. అదే సమయంలో జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా రూ.55 లక్షల సంపదతో పేద సీఎం జాబితాలో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచారు. దీదీకి ముందు ఆయనదే చోటు.సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో మూడో స్థానంలో కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిలిచారు. ఆయనకు మొత్తం 51.93 కోట్ల ఆస్తులు ఉన్నట్లు తేలింది. ఇందులో స్థిరాస్తులు 30.61 కోట్లు కాగా.. చరాస్తులు రూ.21.32 కోట్లుగా తేల్చారు. ఇక.. అతి తక్కువ ఆస్తులు ఉన్న ముఖ్యమంత్రుల జాబితాలో మూడో స్థానంలో కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిలిచారు. ఆయనకు మొత్తం 1.18 కోట్ల ఆస్తులు ఉన్నాయని..అందులో స్థిరాస్తుల వాటానే రూ.86.95 లక్షలుగా పేర్కొన్నారు.దేశంలో ముఖ్యమంత్రులుగా వ్యవహరిస్తున్న అధినేతల్లో 13 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని.. హత్యాయత్నం.. కిడ్నాప్.. ముడుపులు.. నేరపూరిత కుట్రలకు పాల్పడటం లాంటి కేసుల్ని ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రులు మొత్తం పది మంది ఉన్నట్లుగా తెలిపింది. ఆస్తుల విషయంలో చంద్రబాబు అగ్రస్థానంలో నిలిచిన వైనం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ఆ రోజు రాహుల్ గాంధీ ఒక ఎంపీలా కాకుండా బౌన్సర్‌లా ప్రవర్తించారు..

హైదరాబాద్,డిసెంబర్ 19న పార్లమెంటు ఆవరణలో ఎంపీల మధ్య తోపులాట జరిగిన ఘటనలో బీజేపీ ఎంపీలు ప్రతాప్‌చంద్ర షడంగి, ముకేశ్ రాజ్‌పూత్ గాయపడ్డారు.ఈ ఘటనపై తాజాగా గాయపడిన వారిలో ఒక ఎంపీ షడంగి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్ ఆవరణలో తాము శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే.. రాహుల్ ఒక ఎంపీలా కాకుండా బౌన్సర్‌లా ప్రవర్తించారని మండిపడ్డారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ లాంటి గొప్ప వ్యక్తులు లోక్‌సభలో విపక్ష నేతలుగా వ్యవహరించారు.. అలాంటి పదవిలో ఉన్న ఆయన ఈ విధంగా ప్రవర్తించడం సరైనది కాదన్నారు. ఇక, తోపులాటలో గాయపడిన తాను డిసెంబరు 28వ తేదీన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తన ఆరోగ్యం బాగానే ఉంది.. తలపై పడిన కుట్లు ఇంకా మానకపోవడంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నానని బీజేపీ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి చెప్పారు.అయితే, లోక్ సభలో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్‌ను అమిత్‌షా అవమానించారని విపక్షాలు ఆందోళన చేశాయి. అదే సమయంలో కాంగ్రెస్సే అంబేద్కర్ ను అవమానిస్తోందంటూ మకరద్వారం మెట్లపై



నిల్చొని ఎన్డీయే ఎంపీలు నిరసన చేశారు. అప్పుడే, ప్రతిపక్ష ఎంపీలూ ఆందోళన చేస్తున్నారు.. అప్పుడు పక్క నుంచి వెళ్లే ఛాన్స్ ఉన్నా.. మెట్లపై కూర్చున్న తమను తోసుకుంటూ రాహుల్ గాంధీ సభలోకి వెళ్లడానికి ట్రై చేశారని బీజేపీ ఎంపీలు ఆరోపించారు. ఈ దాడిలో బీజేపీ ఎంపీలు గాయపడ్డారు.

## నూతన సంవత్సరం వేడుకల కోసం భారతదేశంలో భద్రతా ఏర్పాట్లు

హైదరాబాద్,భారతదేశంలో నూతన సంవత్సర వేడుకలకు ముందు, శాంతిభద్రతలు కాపాడేందుకు అధికారులు భద్రతను పెంచారు. దేశవ్యాప్తంగా పండుగ సమయం కావడంతో, ప్రతి ప్రాంతంలో ప్రత్యేకంగా భద్రతా చర్యలు చేపడుతున్నారు.ఢిల్లీ నగరంలో, పోలీసులు ప్రజల భద్రతను నిర్ధారించేందుకు విస్తృతమైన చర్యలు తీసుకున్నారు. రహదారి భద్రతను పర్యవేక్షించడానికి 16 క్విక్ రియాక్షన్ టీమ్‌లను ఏర్పాటు చేసి, 27 ట్రాఫిక్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇవి రహదారులపై ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడానికి సహాయపడతాయి.ముంబై నగరంలో, కొత్త సంవత్సరం వేడుకలు సురక్షితంగా జరగాలని, 15,000 మంది పోలీసుల సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించకుండా ఉండేందుకు ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది.జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో, ఆర్మీ బలగాలు అప్రమత్తంగా ఉంటూ, వేడుకలకు ముందు పోలీసులు తనిఖీలు ప్రారంభించారు. ఇది భద్రతను మరింత పెంచడంలో సహాయపడుతుంది. ఒడిశాలో, అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.గుజరాత్‌లోని సూరత్ నగరంలో, పోలీసులు 4,000 మంది సిబ్బందితో ప్రత్యేకంగా భద్రత ఏర్పాట్లు చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహించి, ప్రజల భద్రతను కాపాడుతున్నారు. అలాగే, కేరళలో, రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన



రద్దీ ప్రాంతాల్లో డ్రోన్ నిఘాతో ప్రత్యేక బృందాలను మోహరించారు, భద్రతా చర్యలను మరింత పటిష్టం చేశారు.ఈ విధంగా, భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో భద్రతా చర్యలను పెంచడం, ప్రజల రక్షణకు సంబంధించి ప్రత్యేక చర్యలను తీసుకోవడం ద్వారా, కొత్త సంవత్సరం వేడుకలు సురక్షితంగా జరగాలని అధికారులు ఆశిస్తున్నారు.

# సంపాదకీయం

బుధవారం 01-01-2025

## మ్యాజిక్ ఆఫ్ బుక్స్

''ది జాయ్ ఆఫ్ రీడింగ్: సెలబ్రేటింగ్ ది మ్యాజిక్ ఆఫ్ బుక్స్''%ౌ%పుస్తక మహోత్సవానికి ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఇచ్చిన క్యాప్షన్ ఇది. చదవడంలోని ఆనందాన్ని, పుస్తకంలోని మ్యాజిక్‌ని సంబరం చేసుకోమంటున్నది ఏఐ. పుస్తకం%ౌ%పఠనం మానవ వికాసానికి, విజ్ఞానానికి ఆధారం. 'చదవడం ఒక సంభాషణ. అన్ని పుస్తకాలు మనతో మాట్లాడతాయి. కాని, మంచి పుస్తకం వింటుంది కూడా' అంటారో రచయిత. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో, మనసుకు చదవడం అంత అవసరం. 'సంస్కృతిని నాశనం చేయడానికి మీరు పుస్తకాలను కాల్చాల్సిన అవసరంలేదు. వాటిని చదవడం మానేయండి' అంటాడు రచయిత రే బ్రాడ్‌బరీ. సంస్కృతి వికాసంలో పుస్తకం నిర్వహించే భూమిక ఎంత కీలకమైనదో దీన్నిబట్టే అర్థమౌతుంది. గతంలో ప్రయాణాల్లో, తీరిక సమయాల్లో చదువొచ్చిన ఎవరి చేతిలో చూసినా పుస్తకం కనిపించేది. నట్టింటిలోకి నడిచొచ్చిన టీవీ%ౌ% పుస్తకం పట్టుకోకుండా చేస్తే, ఆ తర్వాత వచ్చిన మొబైల్%ౌ% పుస్తక పఠనాన్ని దూరం చేసింది. ప్రతిరోజూ కనీసం ఆరు నిమిషాల పాటు పుస్తకం చదివితే చాలు, హృదయ స్పందనతో పాటు కండరాలపై ఒత్తిడి 60శాతం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఒత్తిడిని ఎదుర్కోవడానికి టీ, కాఫీ తాగడం, నడక వంటివి చేస్తుంటారు. వీటన్నింటికంటే శ్రేష్టమైనది, ఆరోగ్యకరమైనది పుస్తకపఠనం అని యుకెలోని 'ససెక్స్' యూనివర్సిటీ గతంలో నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. రక్తపోటు, హృదయ స్పందనరేటు, మనోవేదన, ఒత్తిడి వంటివి పుస్తక పఠనం ద్వారా తగ్గుతాయని అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్ పరిశోధన వెల్లడించింది. పుస్తకం ఏదైనా కావొచ్చు. పఠనం మెదడుకు ఔషధం అని మానసికవేత్తలు చెబుతున్నారు. 'పుస్తకం దీపంలా వెలుగునిచ్చి, మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది'' అంటారు అంబేద్కర్. అంతేకాదు%ౌ% పుస్తకాలు చదవని వారితో పోల్చితే%ౌ% చదివేవారు మెరుగైన ప్రతిభ కలిగివుంటారని బ్రిటన్‌లోని నేషనల్ లిటరసీ ట్రస్ట్ సర్వే తేల్చింది. అమెరికా, న్యూజిలాండ్, ఫిన్లాండ్, ఇంగ్లాండ్, కెనడా, సింగపూర్ వంటి దేశాలలో ఎన్ని పుస్తకాలు చదివామో చెప్పుకోవడం గొప్పతనంగా భావిస్తారు. వారి స్కూళ్లలో బోధనతోపాటు పుస్తక పఠనం ఒక పాఠ్యాంశంగా వుంటుంది. తల్లిదండ్రులు రోజూ కొంత సమయం పుస్తకాలు చదవడానికి కేటాయిస్తే%ౌ% పిల్లలు వారిని అనుసరిస్తారు. ఖాళీ సమయాల్లో పిల్లలను పుస్తకాల షాపులకు, పుస్తక ప్రదర్శనలకు, గ్రంథాలయాలకు, పుస్తక ఆవిష్కరణ సభలకు తీసుకెళుతుండటం వలన, పిల్లల్లోనూ పుస్తకాలు చదవాలన్న జిజ్ఞాస పెరుగుతుంది.'చదువని వాడజ్ఞుండగు/ చదివిన సదసద్వివేక చతురత గలుగున్!' అంటాడు పోతన. పుస్తక పఠనం పెంచుకోవాలన్న నిర్ణయం తీసుకోడానికి ఇదొక సందర్భం. 35వ పుస్తక మహోత్సవం విజయవాడ వేదికగా జనవరి 2 నుంచి 12 వరకూ జరగనుంది. సంక్రాంతికి ముందొచ్చే అతి పెద్ద పండుగ ఈ పుస్తక మహోత్సవం. 11రోజుల పాటు 200 స్టాళ్లకు పైగా ఏర్పాటు చేసిన ఈ మహోత్సవంలో 10లక్షల మందికి పైగా పుస్తక ప్రియులు పాల్గొంటారని అంచనా. పుస్తక సాంగత్యం పెంచుకోవడం ద్వారా విజ్ఞానం, మానసిక వికాసం అలవడుతుంది. 'పుస్తకాలు లేని ఇల్లు, ఆత్మలేని శరీరం లాంటిది' అంటాడు సిసిరో. డిజిటల్ పుస్తకాలొచ్చిన తర్వాత మామూలు పుస్తకాలకు కాలం చెల్లింది అనుకునే వారూ లేకపోలేదు. సాంకేతికత ఉచ్ఛస్థితిలో వున్న దేశాల్లో సైతం పుస్తక అమ్మకాలు పెరుగుతుండడం, ప్రపంచవ్యాప్తంగా బుక్ ఫెయిర్‌లు జరుగుతుండట పుస్తకాదరణకు నిదర్శనం. డిజిటల్ కంటే పుస్తక స్పర్శలోని అనుభవం గొప్పగా వుంటుంది. పుస్తకంలోని మ్యాజిక్ అదే. పుస్తకాలు, అక్షరాలు లేకుంటే మానవ విజ్ఞానం ఎలా వుండేది? అందుకే%ౌ% నచ్చిన, మెచ్చిన, ప్రభావితం చేసిన పుస్తకం కొనుక్కోవాలి. ఈ కొత్త సంవత్సరాన్ని పుస్తక పఠనంతో ప్రారంభించేందుకు పూనిక తీసుకోవాలి. పిల్లల్ని ఈ పుస్తక మహోత్సవానికి తీసుకురావడం అంటే%ౌ% వారిలో పుస్తకాల పట్ల, పఠనం పట్ల ఆసక్తిని పాదుకొలిపే ఒక సదవకాశంగా భావించాలి. పుస్తకాల అడుగుజాడల్లో పిల్లల్ని అక్షరాలా నడపాలి. ఈ అడుగులే వారి భవితకు సోపానంగా మారతాయి.

# చైనా ప్రాజెక్టుతో బ్రహ్మప్రళయమే!

చైనా,ఉత్తర హిమాలయాలలో కైలాస పర్వతపాదం వద్ద హిమానీనదంలో పుట్టి, టిబెట్‌లో యార్లంగ్ జంగ్‌బోగా, అరుణాచల్‌ప్రదేశ్‌లో సియాం గ్గా పేరొందిన బ్రహ్మపుత్ర నది ఇప్పుడు వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. పొరుగున ఉన్న చైనా ఈ నదిపై జలవిద్యుత్ కేంద్ర నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించడమే ఇందుకు కారణం. బ్రహ్మపుత్రపై 137 బిలియన్ డాలర్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్దదని, దీనికి చైనా ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని జిన్హువా వార్తాసంస్థ నాలుగు రోజుల క్రితం ప్రచురించిన ఓ కథనం భారత్‌లో కలకలం రేకెత్తిస్తోంది. బ్రహ్మపుత్ర నది అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే చోట ఒక విశాలమైన అగాధంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం చైనా ఉపక్రమిస్తోంది. ఈ ప్రాంతం భారత సరిహద్దుకు కేవలం 30 దూరంలో ఉండటం వల్ల భారత ప్రభుత్వ కలవరపాటుకు కారణం. ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణం సాకారమైతే, చైనా- భారత సరిహద్దుల్లో బ్రహ్మపుత్రపై సర్వాధికారాలు చైనాకు అన్యాపదేశంగా సంక్రమిస్తాయనడంలో సందేహం లేదు. వేసవిలో ఈ నదీ జలాలను భారీ స్థాయిలో మళ్లించుకునే అవకాశం పొరుగున దక్కడమే కాదు, వర్షాకాలంలో పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేస్తే, దిగువన మన దేశంలో అనేక రాష్ట్రాలు ముంపునకు గురై, ప్రాణనష్టం, ఆస్తి నష్టానికి దారితీసింది. అసలే, మెరుపు వరదలకు బ్రహ్మపుత్ర పెట్టింది పేరు. సముద్రానికి ఆటుపోట్లు వచ్చినట్లుగానే, బ్రహ్మపుత్రకు అలలపోటు ఉంటుంది. వరదల సమయంలో ప్రళయభీకరంగా పారే బ్రహ్మపుత్రను ఆరితేరి చూడటం కూడా భీతిగొల్పుతుందంటే అతిశయోక్తి కాదు. అలాంటిది, చైనా ఒకేసారి దిగువకు నీరు వదిలితే ముంపు ఎంతటి వినాశనానికి దారితీస్తుందో ఊహించుకోవచ్చు. పైగా భూకంప జోన్‌లో ఉన్న టిబెట్ వద్ద ఈ భారీ ప్రాజెక్టును నిర్మించడం చైనా దుందుడుకుతనానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అరుణాచల్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, పశ్చిమబెంగాల్, సిక్కిం రాష్ట్రాలకు బ్రహ్మపుత్ర, దాని ఉపనదులే ప్రాణాధారం. ఈ నదిపై కోట్లాది మంది జీవనం గడుపుతున్నారు. ఈ నదీ పరీవాహక ప్రాంతంలో 40 శాతం జలవిద్యుత్తు, 30 శాతం నీటి అవసరాలకు బ్రహ్మపుత్రే ఆధారం. ఇప్పటికే చైనా నిర్మించిన త్రీ గోర్జెస్ డ్యామ్‌పై ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాంగ్జీ నదిపై 181 మీటర్ల ఎత్తు 2.33 కిలోమీటర్ల పొడవుతో నిర్మించిన ఈ డ్యామ్ కారణంగా భూపరిభ్రమణ వేగం 0.06 మైక్రో సెకన్లు తగ్గిపోయిందని, సూర్యుడినుంచి భూమి రెండు సెంటీమీటర్ల దూరం జరగడానికి కూడా ఈ ప్రాజెక్టే కారణమని వారు నెత్తినోరూ చూస్తున్నారు. ఇప్పటివరకూ ఇదే అతి పెద్ద ప్రాజెక్టు కాగా,



దీనిని మించిన స్థాయిలో నిర్మించనున్న బ్రహ్మపుత్ర ప్రాజెక్టు మరెన్ని అనర్థాలకు కారణమవుతుందో చెప్పలేం. ఇరుదేశాల మధ్య బ్రహ్మపుత్ర నదీ జలాలపై 2002లో తొలి ఒప్పందం కుదిరింది. ఈ నదిపై చేపట్టే ప్రాజెక్టులు, జలాల వినియోగంపై సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలన్నది ఆ ఒప్పందం సారాంశం. కానీ ప్రస్తుతంగా ద్వైపాక్షిక సంబంధాలు బలహీనపడిన కారణంగా చైనాను ఇచ్చిపుచ్చుకునేందుకు వీలు లేదు. పైగా చివరిసారి కుదిరిన ఒప్పందం కాలపరిమితి గత ఏడాది ముగిసిపోవడంతో ఇప్పుడు చైనా జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం సిద్ధమవుతోంది. గత క్రమంగా చైనా- భారత్‌ల మధ్య సంబంధాలు ఉప్పునిప్పులా మారాయి. నాలుగేళ్ల క్రితం తూర్పు లద్దాఖ్ సరిహద్దుల వద్ద చైనా భారీ స్థాయిలో బలగాలను మోహరించడం, గల్వాన్ లోయలో ఇరుదేశాల సైనికుల మధ్య ఘర్షణ తలెత్తడం వంటి సంఘటనలతో ఉద్రిక్తతలు పెరిగాయి. అయితే నిరంతర దౌత్య ప్రక్రియతో పాటు మోడీ,జీ జిన్‌పింగ్ ఇటీవల రష్యాలోని కజాన్ వేదికగా భేటీ అయిన తర్వాత ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారాయని భావిస్తున్న తరుణంలో చైనా జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం పూనుకోవడంతో మళ్లీ మొదటికి వచ్చే ప్రమాదం గోచరిస్తోంది. ఆసియాలో శరవేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ, ఐదో ఆర్థికశక్తిగా ఎదుగుతున్న భారత్.. చైనాకు కంటగింపుగా మారింది. పైపెచ్చు, అమెరికా -భారత్‌ల మధ్య గత దశాబ్దకాలంగా బలపడిన మైత్రీబంధం కూడా చైనీయులకు కంటిమీద నిద్రలేకుండా చేస్తోంది. బ్రహ్మపుత్రపై తాను నిర్మించదలచిన ప్రాజెక్టు వల్ల భారత్, బంగ్లాదేశ్‌లకు ఎలాంటి ప్రమాదమూ ఉండదని చైనా నమ్మబలుకుతున్నా మేకవన్నె పులిలాంటి ఆ దేశం మాటలు విశ్వసించలేనివి. అంతర్జాతీయ మద్దతు కూడగట్టి, ఒత్తిడి పెంచడం ద్వారా చైనా నిర్మించ తలపెట్టిన బ్రహ్మపుత్ర ప్రాజెక్టును నిలువరించాలి.

# మన్మోహన్ వ్యక్తిత్వం, లౌకిక నిబద్ధత



న్యూఢిల్లీ,రాజకీయ విభేదాలను మించి అసహన దూషణలు తాండవిస్తున్న ఈ రోజుల్లో కూడా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు దేశం ఏకోన్ముఖంగా జోహారులర్పిం చింది. ఆయనను పితామహుడుగా చెప్పే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలతో గట్టిగా విభేదించి పోరాడే వామపక్షాలు కూడా ఆయన లౌకిక నిబద్ధతను గౌరవించాయి. దేశానికి మేలు చేసేవిగా తను నమ్మిన విధానాలనే ఆయన అనుసరించారని, వ్యక్తిగా ఆయన నిబద్ధత ప్రశ్నించడానికి వీలు లేనిదని పేర్కొన్నాయి. ఆ కార్పొరేట్ విధానాలకు తన మత రాజకీయాలు జోడిస్తూ కాంగ్రెస్‌ను బద్ధ శత్రువుగా పరిగణించే బిజెపి నేతలూ ఆర్థిక రంగంలో మన్మోహన్ ముద్రను కీర్తిస్తున్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు విధానాలు 'మన్మోహనామిక్స్' అనే పేరు పెట్టారు గాని నిజానికి వాటిని స్పష్టమైన చారిత్రక నేపథ్యంలోనే చూడవలసి వుంటుంది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవడం, పివి నరసింహారావు ప్రధాని పదవి చేపట్టడం కాస్త అటూ ఇటూగా జరిగాయి. భారత పాలకవర్గాలు అప్పటివరకూ కొన్ని తేడాలతో అనుసరిస్తూ వచ్చిన అలీన, స్వావలంబన విధానాల నుంచి విడగొట్టు కోవడానికి సిద్ధమన్నారు. కార్పొరేట్ ప్రైవేటీకరణ విధానాల వైపు మరలే ఆ ప్రక్రియను అమలు చేయడానికి అటు పి.వి తో పాటు ఇటు మన్మోహన్ సరైన వ్యక్తిగా ఆ వర్గాలు కూడా భావించా యనేది నిర్వివాదాంశం.

### కీలక ఎంపిక

2004లో సోనియా గాంధీ ప్రధాని పదవి చేపట్టక పోవడం మంచిదని నిర్ణయించుకున్నాక ఆ స్థాయిలో విశ్వసనీయత, విషయజ్ఞత వున్న నేతగా మన్మోహన్‌నే ఎంచుకోవడానికి కూడా స్పష్టంగా ఇవే కారణమైనాయి. ఆనాడు లోక్‌సభలో 59 మంది సభ్యులు గల వామపక్షాల మద్దతు లేకపోతే యుపిఎ 1 సర్కారు ఏర్పాటే సాధ్యం కాదు. అలాంటి సర్కారుకు సారథ్యం వహించడమంటే భిన్న కోణాలను సమన్వయం చేయవలసి వుండేది. యుపిఎ1 మొదటి దశలో 11 అంశాల కనీస కార్యక్రమం ప్రకటించడం అలా జరిగిందే. గ్రామీణ ఉ పాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం, భూ సేకరణ చట్టం లాంటివి ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో రూపొందడానికి వామపక్షాల ఒత్తిడి కీలక పాత్ర వహించింది. వాటినే ఇప్పుడు ఆయన సానుకూల విజయాలుగా అభివర్ణించడం చూస్తున్నాం. అయితే చిల్లర వ్యాపారంలో విదేశీ కంపెనీలకు ద్వారాలు తెరవడం నుంచి అమెరికాతో పౌర అణు ఒప్పందంపై సంతకాలు చేయడం వంటివి వామపక్షాలు ఏ మాత్రం ఆమోదించలేదు. అలాగే తనను కోరితెచ్చుకున్న బలాఢ్య వర్గాల ప్రభావం బలమైంది గనక మన్మోహన్ సింగ్ వెనక్కు తగ్గలేదు. 2007 ఆగస్టు 7న టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏది ఏమైనా అణు ఒప్పందం తప్పదని, వామపక్షాలు మద్దతు ఉపసంహరిం చుకుంటే కానివ్వండని తీవ్ర వ్యాఖ్యానం చేశారు. దాదాపు ఆ వెనువెంటనే ప్రకాశ్ కరత్, ఎ.బి.బర్దన్‌ల ఉపసంహరణ ప్రకటన వెలువడింది. 1972లో ఆర్థిక సలహాదారుగా, అంతర్జాతీయ వేదికల్లో భారత ప్రతినిధిగా, ప్రపంచ బ్యాంకులో కీలక అధికారిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడుగా అనేక విధాల బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్‌కు దేశ విదేశీ పాలక వర్గాల ఆర్థిక నీతి బాగా తెలుసు. రాజకీయ విధానాల మూలాలు ఆర్థిక శాస్త్రంలో నిర్ణయమవుతాయనీ తెలుసు. సోవియట్ అనంతర ప్రపంచ పరిణామాలపై పాలక వర్గాల కోణం ఏమిటో ఆయనకు పూర్తి అవగాహన వుంది. రాజీవ్ గాంధీ దారుణ హత్య తర్వాత అనూహ్య పరిస్థితుల్లో పివి నరసింహారావు ప్రధాని అవడం, తనను ఆర్థిక మంత్రిగా ఎంపిక చేయడం వెనక వున్న బలీయమైన జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ వర్గాల పట్టు కూడా ఆయనకు పూర్తిగా తెలుసు. ఆర్థికమంత్రిగా ఇన్ని తీవ్ర నిర్ణయాలు ఎలా తీసుకున్నారంటే ఎప్పుడూ జేబులో రాజీనామా లేఖ పెట్టుకుని తిరిగేవాడినని చెప్పగలిగారంటే అందుకు కారణం ఆ వర్గాలే.

### యుపిఎ 2 కష్టాలు

అణు ఒప్పందంపై తీవ్ర చర్చ తర్వాత టిడిపి తదితర పార్టీలను చీల్చి, ఎస్‌పిని తమ వైపు తిప్పుకుని యుపిఎ గట్టెక్కింది కానీ మన్మోహన్ వ్యక్తిగతంగానూ, యుపిఎ ప్రభుత్వంగానూ ఎదుర్కొన్న పరిస్థితులు పూర్తి మారిపోయాయి. పదవులు, ప్రయోజనాల బేరాలు తప్ప మరే విధాన సమస్యలు లేని ప్రాంతీయ మిత్రులను నిలబెట్టు కోవడానికి ఇష్టం లేని వారిని మంత్రులను చేయడంతోసహా ఆయన చాలా విన్యాసాలే చేయవలసి వచ్చింది. రకరకాల ఆరోపణలు, కుంభకోణాల కేసులతో పెనుగులాడవలసి వచ్చింది. ఆ క్రమంలోనే మిత్రమ ప్రభుత్వంగనక రాజీ పడాల్సి వచ్చిందని యుపిఎ 2 కాలంలో ఆయన బాహాటంగా ఒప్పేసుకున్నారు. మీడియా ఛానళ్ల అధినేతలతో సమావేశమై యుపిఎ అంటేనే అవినీతి అన్నట్టు చిత్రించవద్దని అభ్యర్థించాల్సి వచ్చింది. ఇన్ని ఆరోపణల మధ్యనా ఎవరూ ఆయన నిజాయితీని శంకించడం గానీ, తనకు వ్యక్తిగత బాధ్యత ఆపాదించడం గానీ జరక్కపోవడం నిజంగా ఆశ్చర్యమే. అదే ఆయన వ్యక్తిత్వ ముద్ర. ఇప్పుడు అదానీ వ్యవహారం మోడీతో సహా రచ్చకెక్కిన తీరుకు ఇది పూర్తి భిన్నం. అక్కడ అన్నీ కొల్లగొట్టుకుపోయినా హుజూర్ దోచుకుపోయిన వారి వివరాలు మాత్రం చెప్పడం లేదు అని పార్లమెంటులో ప్రతిపక్ష నాయకురాలు సుష్మా స్వరాజ్ ఒకసారి కవితతో గేలి చేశారు. నేను మీ కళ్లకు ఆనకపోవచ్చుగానీ కనీసం నా బలమైన ఆకాంక్షనైనా చూడండి అని మన్మోహన్ ఇక్బాల్ కవితతో బదులిచ్చారు! వారిద్దరి కవితా వాగ్వాదాలు రసవత్తరంగా వుండేవి. సాహిత్యంలోనూ ఆయన దిట్ట.

### బిజెపి గురివింద నీతులు

2014 ఎన్నికల తరుణంలో వెలువడిన మీడియా సలహాదారు సంజరు బారు పుస్తకంలో ప్రధానిగా మన్మోహన్ ఫైళ్లు సోనియా గాంధీకి పంపించిన తర్వాతే నిర్ణయాలు తీసుకునేవారని రాశారు. ఆ బాధ్యత ఎవరు నిర్వహించేవారో కూడా పేర్కొన్నారు. వెంటనే బిజెపి వారు రంగంలోకి దిగిపోయారు. ఇది మోడీ బృందం ప్రచారానికి అస్త్రంగా ఉపయోగపడేందుకు వేసిన అభాండమని నాటి ప్రధాని కార్యాలయం ఖండించింది. ఆ యా పార్టీలు తమ ప్రభుత్వాల విధానాలపై చర్చ చేయడం ప్రజాస్వామ్యబద్ధమే. రాజకీయంగా ఒక పంథా తీసుకోవడం వేరు, రాజ్యాంగ పరంగా నిర్ణయాలు, ఉత్తర్వుల జారీ వేరు. నాగపూర్ ఆరెస్సెస్ రాజగురువుల ముందు మోడీతో సహా మొత్తం బిజెపి మంత్రులు హాజరై నివేదికలిస్తారు గానీ ఇతరులపై లేనిపోని ముద్రలేస్తుంటారు. రాజ్యాంగేతర శక్తుల పాత్రగా నిందిస్తారు, ఆరెస్సెస్‌కు అన్ని వేళలా విధేయంగా వుంటూ ఆదేశాలు తీసుకునే బిజెపిని ఏమనాలి? మన్మోహన్‌ను కేవలం, సోనియా విధేయుడుగా మాత్రమే కొందరు మాట్లాడటం ఎంత పాక్షికమో దీన్ని బట్టే తెలుస్తుంది. ఆయన దేశ సమగ్రతకూ, మానవీయ, లౌకిక విలువలకూ విధేయుడే. సోనియా గాంధీనే గాక ఒక ముఖ్యమంత్రిగా వున్న వైఎస్ రాజశేఖర రెడ్డినీ అమితంగా గౌరవించేవారట. 'వై.ఎస్ అక్కడ (ఉమ్మడి ఎ.పిలో) వున్నారు గనకే నేను ఇక్కడ వున్నాను' అని ప్రధాని తనతో ఎప్పుడూ చెప్పే వారని సంజరు బారు ఇటీవల కూడా వెల్లడించారు. 2005లో ప్రజాశక్తి రజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మన్మోహన్ సిపిఎం నేత సీతారాం ఏచూరిని భారత రాజకీయాల్లో ప్రకాశవంతమైన తారగా అభివర్ణించారు. వామపక్షాలు అణు ఒప్పందంపై మద్దతు ఉపసంహరించుకునే తరుణంలో కూడా వాటిపై తనకు కోపం లేదనీ, మిత్రులుగా కలసి పనిచేస్తామని ప్రకటించారు. తీవ్ర ఉద్రిక్తతలు, వైరుధ్యాల మధ్య తెలంగాణ విభజన చట్టాన్ని ఆమోదించడం ద్వారా తెలంగాణకు, ప్రత్యేక హోదా ప్రకటించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ఆయన ఇష్టుడయ్యారు. ఇవన్నీ ఆయన పరిపక్వతను చెబుతాయి.

### గౌరవంగా వీడ్కోలు

2002 గుజరాత్ ఘటనల తర్వాత మోడీ వైపు మొగ్గిన కార్పొరేట్ శక్తులు ఆయనను ప్రధాని అభ్యర్థిగా ముందుకు తెచ్చినప్పుడు మన్మోహన్ తీవ్రంగానే ధకొన్నారు. కాంగ్రెస్ 1984లో సిక్కులపై హత్యాకాండతో కళంకం ఆపాదించుకున్నప్పటికీ ఆ పార్టీ తరపున దేశానికే తొలి సిక్కు ప్రధానిగా ఆయన భారత దేశ బహుళతాన్ని చాటారు.

# పేర్ని నాని తప్పులే.. వారి కుటుంబాన్ని వీధుల్లో పడేసింది

గుటూరు, రేషన్ బియ్యం మాయమైంది నిజం.. డబ్బులు కట్టింది వాస్తవం.. ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గిడ్డంగి పెట్టిందెవరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన వారిని మీరు తిట్టలేదా.. అని నిలదీశారు. మంగళగిరిలో పవన్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'వైకాపా నేత పేర్ని నాని చేసిన తప్పులే ఆయన ఇంట్లో వాళ్లను వీధిలోకి తెచ్చాయి. అప్పుడు బూతులు తిట్టి, ఇప్పుడు నీతులు వల్లిస్తే ఎలా? అని అన్నారు. గత ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం చాలా గొప్పగా పనిచేస్తోంది. అడ్డగోలు నిర్ణయాలపై అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు, పనిచేసే సంస్కృతిని చంపేశారు. గత ప్రభుత్వం తొలి 6 నెలలు, ఈ ప్రభుత్వం 6 నెలల పాలన బేరీజు వేసుకోండి. ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పనిచేయాలని చెబుతున్నాం. పాలన తీరు, ప్రజా సమస్యల పరిష్కారంపైనే ఇప్పటివరకు దృష్టి పెట్టాం. ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. ఎన్డీఏ ఆధ్వర్యంలో చాలా బాధ్యతతో పనిచేస్తున్నాం. పదవులు అనుభవించడం కాదు.. బాధ్యతతో పనిచేస్తాం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. తాగునీరు, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని పవన్ కల్యాణ్ చెప్పారు. రాజకీయాల్లో పని తీరే ప్రామాణికమని, కలిసి పనిచేసిన వారిని గుర్తించాల్సిన బాధ్యత తనకు ఉందని పవన్‌కల్యాణ్ అన్నారు. సోదరుడు, జనసేన నాయకుడు అయిన నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చే విషయమై స్పందించారు.'మాకు బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా అన్నయ్య సొంతంగా ఎదిగారు. ఇప్పుడు మా తర్వాత తరం పిల్లలకు ఒక బ్యాక్‌గ్రౌండ్ ఉంది. మనతో ప్రయాణం చేసి, పనిచేసిన వారిని నేను గుర్తించాలి. నాగబాబు నాతో పాటు సమానంగా పనిచేశారు. వైసీపీ నేతలతో తిట్లు తిన్నారు. పార్టీ కోసం నాగబాబు నిలబడ్డారు. ఇక్కడ కులం, బంధుప్రీతి కాదు.. పనిమంతుడా కాదా? అన్నది చూడాలి. ఎంపీగా ప్రకటించి, మళ్లీ నాగబాబును తప్పించాం"మనోహర్, హరిప్రసాద్ మొదటి నుంచి పార్టీ కోసం పనిచేశారు. ఎవరికి ప్రతిభ ఉందో చూసి, వాళ్లకు పదవులు ఇస్తాం. ఈ విషయంలో మీరెందుకు జగన్‌ను అగడలేదు? కేవలం పవన్‌కల్యాణ్‌ను మాత్రమే ఎందుకు అడుగుతున్నారు? నాగబాబు ఎమ్మెల్సీగా ఎంపికవుతారు. మంత్రి పదవి విషయంలో తర్వాత చర్చ చేస్తాం. నాగబాబు త్యాగం గుర్తించి రాజ్యసభకు అనుకున్నాం. కుదరలేదు కాబట్టి, ఎమ్మెల్సీ అనుకున్నాం. కందుల దుర్గేష్ ఏ కులమో నాకు తెలియదు. ఆయన పనితీరు నచ్చి మంత్రి పదవి ఇచ్చా. రాజకీయాల్లో కులం కాదు.. పని తీరే ప్రామాణికం' అని పవన్‌కల్యాణ్ అన్నారు. 'మనతో ప్రయాణం చేసి, పని చేసిన వారిని నేను గుర్తించాలి నాగబాబు నాతో పాటు సమానంగా పని చేశారు. వైసీపీ నేతలతో తిట్లు తిన్నారు, పార్టీ కొసం నిలబడ్డారు. ఇక్కడ కులం, బంధు ప్రీతి కాదు.. పనిమంతుడా కాదా అనేదే ముఖ్యం. నాగబాబు ఎమ్మెల్సీగా ఎంపిక అవుతారు. మంత్రి అనేది తరువాత చర్చ చేస్తాం. నాగబాబు త్యాగం గుర్తించి రాజ్యసభ అనుకున్నాం. అక్కడ కుదరలేదు కాబట్టి.. ఎమ్మెల్సీ అనుకున్నాం. ముందు నాగబాబు ఎమ్మెల్సీ అయ్యాకనే మంత్రి పదవి గురించి ఆలోచిస్తానని అన్నారు. ఎక్కడో ప్రత్యేక పరిస్థితులు ఉంటేనే ఎమ్మెల్సీ కాకముందు మంత్రి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ ఇప్పుడు అంత ప్రత్యేక పరిస్థితులు ఏమి లేవన్నారు. అందువలన నాగబాబు ముందు ఎమ్మెల్సీ అవ్వాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

# విద్యార్థులపై లాఠీఛార్జి అమానుషం

న్యూఢిల్లీ,బీహార్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్రంగా ఖండించారు. డబుల్ ఇంజిన్ పాలనలో యువతపై డబుల్ దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. ఈ చలిలో విద్యార్థులపై జలఫిరంగులు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడం అమానుషమని ఆవేదన వ్యక్తంచేశారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఆదివారం వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. వారిని అడ్డుకోవడానికి పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి.. బిహార్‌లో మూడు రోజుల వ్యవధిలో ప్రభుత్వం రెండుసార్లు విద్యార్థులను చిత్రహింసలకు గురిచేసిందని మండిపడ్డారు. పరీక్షల్లో అవినీతి, రిగ్గింగ్‌లు, పేపర్ లీక్‌లను అరికట్టడం తమ బాధ్యత అనే విషయం మరిచిపోయిందన్నారు. తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడుతుంటే సహించలేక వారిని అణచివేయడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ మాట్లాడుతూ.. అభ్యర్థులపై పోలీసుల చర్య చాలా బాధాకరమని అన్నారు. 'బీపీఎస్సీ అభ్యర్థులపై పోలీసుల చర్య చాలా దారుణం. చాలామందికి తీవ్ర గాయాలయ్యాయి. బయటకు వచ్చిన వీడియోలను చూస్తుంటే వారెంత బాధను అనుభవించారో అర్థమవుతోంది' అని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఉదాహరణ అన్నారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఈ సంఘటనను నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఉదాహరణగా అభివర్ణించారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న యువతతో పోలీసులు క్రూరంగా ప్రవర్తించడం ప్రభుత్వ నియంతృత్వాన్ని మరోసారి ప్రజలకు తెలియజేసిందని అన్నారు. విద్యార్థిగా ఎన్నో ఉద్యమాలు చేసి.. సీఎం స్థాయికి ఎదిగిన నీతీశ్ కుమార్ ప్రభుత్వం నుంచి ఈ ప్రవర్తనను తానెప్పుడూ ఊహించలేదని అన్నారు. విద్యార్థులతో అధికారులు చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ల్లో అవకతవకల విషయంలో ఆదివారం వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగారు. జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విద్యార్థులకు పూర్తి మద్దతును ప్రకటించారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అభ్యర్థులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో కిశోర్‌తోపాటు పలువురు విద్యార్థులపైనా పోలీసులు కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.

# రేషన్ బియ్యం మాయం కేసు

విజయవాడ, రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని భార్య జయసుధకు కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మరోసారి నోటీసులు జారీ చేశారు. గోదాములో బియ్యం మాయంపై ఇటీవల ప్రాథమిక విచారణ చేపట్టిన పౌరసరఫరాల శాఖ అధికారులు తొలుత 185 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం షార్టేజీ వచ్చినట్లు గుర్తించారు. దీనికిగానూ ఇప్పటికే ఆమె రూ.1.68 కోట్లు జరిమానా చెల్లించారు. అయితే, తాజాగా ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టిన అధికారులు మొత్తంగా 378 మెట్రిక్ టన్నుల బియ్యం మాయమైనట్లు తేల్చారు. దీంతో పెరిగిన షార్టేజీకి కూడా జరిమానా చెల్లించాలని తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు. అదనంగా మరో రూ.1.67 కోట్లు చెల్లించాలని గీతాంజలి శర్మ నోటీసుల్లో పేర్కొన్నారు.

# భారతరత్న ఇవ్వాలంటూ ప్రత్యేక తీర్మానం

హైదరాబాద్, దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ అసెంబ్లీ ఘనంగా నివాళి అర్పించింది. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయన సేవలను కొనియాడుతూ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో తెలంగాణశాసనసభ ప్రత్యేక సమావేశంలో ఆయన సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని చెప్పారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవలందించారని పేర్కొన్నారు. 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయన ఊపిరిలూదారని సీఎం వివరించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ ఏర్పడింది. మన్మోహన్ సింగ్ ఎల్‌పీజీ విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపారు. 2004-14 మధ్య ప్రధానిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధిహామీ, ఆర్టీఐ, ఎన్‌హెచ్‌ఆర్‌ఎంను ప్రారంభించారు. ఆర్థిక స్థితిగతులు మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారని సిఎం అన్నారు. సామాజిక విప్లవ కార్యక్రమమైన ఆధార్‌ను మన్మోహన్ ప్రారంభించారు. సరళీకృత ఆర్థిక విధానాలు తెచ్చి ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు. ఆయన సేవలు భావితరాలు గుర్తుంచుకోవాలి. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు. ఆయన నీతి, నిజాయతీ, నిబద్ధత కలిగిన నేత. జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ప్రధాని సహా అనేక హోదాల్లో ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ఉపాధిహామీ పథకాన్ని అనంతపురం, మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం .2013లో భూసేకరణ చట్టం తెచ్చి నిరుపేదలకు న్యాయం జరిగేలా చేశారు. 2006లో అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేసి ఆదివాసీలను ఆదుకున్నారు. ఐటీ రంగంలో శాసించగలుగు తున్నామంటే మన్మోహన్ విధానాలే కారణం. ఆయన తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ బిల్లులను 2 సభల్లో పాస్ చేయించిన సారథి. ÷నాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని బలమైన శక్తిగా నిలిపారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు, సామాజిక పరిస్థితి అర్థం చేసుకుని చట్టాల ద్వారా ప్రజల్లో ధైర్యం నింపారన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చారని చెప్పారు. పాలనాపరమైన అంశాలను సామాన్యుడూ తెలుసుకునేలా 2005లో ఆర్టీఐ తెచ్చారని గుర్తుచేశారు. ఆయన తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసిందని పేర్కొన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని భట్టి విక్రమార్క చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే విప్లవాత్మక భూసేకరణ చట్టం వచ్చిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. దేశ క్షేమం దృష్ట్యా మన్మోహన్ సింగ్ న్యూక్లియర్ ఒప్పందం కుదుర్చు కున్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు. రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్ సింగ్. సోనియా గాంధీ సూచనల మేరకు ఆయన గొప్ప చట్టాలు తెచ్చారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నవారు జవాబుదారీగా ఉండాలని సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారు. ప్రజల సొమ్ముతో చేసిన పనుల వివరాలు తెలుసుకొనే హక్కు దీని ద్వారా లభించింది. ఆకలి చావులు ఉండకూడదని ఆహార భద్రత చట్టం తెచ్చారు' అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు.దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ అనేక గొప్ప విధానాలు తీసుకొచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేసుకున్నారు. ఆయన సాధారణ స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారని కొనియాడారు. మన్మోహన్‌ను ఆర్థికమంత్రిగా అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఎంపిక చేశారని గుర్తు చేశారు. గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ తెచ్చారని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్ పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. సామాన్య ప్రజలకు ఆయుధమైన 'ఆర్టీఐ', ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 'ఆధార్' తెచ్చారన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో రాష్ట్రాల్లో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన క్రియాశీల పాత్ర పోషించారని శ్రీధర్‌బాబు చెప్పారు.

# దేశ ఆర్థిక వ్యవస్థకు దవ,దిశ చూపిన దార్శనికుడు

హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ చూపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయనపై పీవీ నరసింహా రావు పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయలేదని చెప్పారు. లైసెన్స్ రాజ్, పర్మిషన్ రాజ్, కోటా రాజ్ విధానాలకు మన్మోహన్ స్వస్తి పలికారని తెలిపారు. అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సభ నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగినట్లు వార్తలొచ్చాయి. కానీ ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ రాలేదని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ జీవితం దేశ సేవలో ధన్యమైందని చెప్పారు. ఆయన సేవలను గుర్తుంచుకునేలా ప్రభుత్వాలు ఏం చేసినా బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. పీవీ ఖ్యాతిని చాటేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని, స్కిల్ వర్సిటీకి నరసింహారావు పేరు పెట్టాలని ప్రతిపాదించారు. భారత రత్నకు మన్మోహన్ సింగ్ 100 శాతం అర్హులేనని చెప్పారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇవ్వాలని బీఆర్‌ఎస్ కోరుతున్నదని తెలిపారు. గతంలో పీవీకి భారత రత్న ఇవ్వాలని బీఆర్‌ఎస్ తీర్మానించిందని, దానికి అనుగుణంగా కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చిందని గుర్తుచేశారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను బాగుచేసేందుకు పీవీ-మన్మోహన్ ద్వయం కృషి చేసిందని వెల్లడించారు. 1996లో కాంగ్రెస్ ఓటమికి ఆర్థిక సంస్కరణలూ కారణమని ఓ కమిటీ నివేదిక ఇచ్చిందని, దానిని చూసిన మన్మోహన్ సింగ్ కంటతడి పెట్టారని పేర్కొన్నారు. మన్మోహన్ భౌతికంగా లేకున్నా ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ఉంటాయన్నారు. విదేశాల్లోనూ ఆయనకు ఉన్నత ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వాటికంటే దేశమే ముఖ్యమని చాటిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని చెప్పారు. ఆయన ఎప్పుడూ పదవుల కోసం చూడలేదని, పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. మన్మోహన్ సంతాప తీర్మానాన్ని మండలిలోనూ పెట్టి ఉంటే బాగుండేదని చెప్పారు.

# అదానీ అవినీతిపై ఉలకరు.. పలకరు!



న్యూఢిల్లీ,రాజ్యాంగ వ్యవస్థలను, విలువలను, కనీసమైన ప్రజాస్వామిక, నాగరిక సంప్రదాయాలను కూలదోయడంలో, ధ్వంసం చేయడంలో సంఘ పరివార్ చూపుతున్న శక్తి ఆశ్చర్యం గొలుపుతోంది. ఇంతకన్నా పతనం, దుర్మార్గం సాధ్యమా అనుకున్న ప్రతిసారీ, దిగజారడానికి మరొకమెట్టు ఉందని సంఘ్ పరివార్ చూపుతోంది. ఈ పది సంవత్సరాలలో పార్లమెంటరీ రాజకీయ, అధికార, ఆర్థిక, విద్య, సామాజిక, సాంస్కృతిక విలువల, న్యాయ వ్యవస్థలలో ప్రతి ఒక్క దాన్నీ కనీవినీ ఎరగనంత ధ్వంసం చేసి, వాటి అసలు స్వరూపం నుంచి తారుమారు చేసి, యథాతథంగా కనబడుతున్నప్పటికీ సారం లో డొల్లలుగా మారిన ఘనచరిత్ర సంఘ పరివార్‌ది. మూడో దఫా అధికారం వచ్చిన తర్వాత మరింత నిస్సిగ్గుగా, దుర్మార్గంగా సాగనున్నదని సూచనలు కనిపిస్తున్నాయి. రెండో దఫా చివరిలో తన అనుంగు మిత్రుడు గౌతమ్ అదానీ అక్రమాలు బైటపడుతుండగా రక్షించడానికి ప్రారంభమయిన ఈ భారత్ తోడో కార్యక్రమం మూడో దఫా మొదట్లోనే మరొక మలుపు తిరిగి, సెబి వంటి స్వతంత్ర నియంత్రణ వ్యవస్థలను కూడా డొల్ల చేసే దిశగా ముందుకు సాగుతోంది. 2023 జనవరిలో బైటపడిన అదానీ కంపెనీల స్టాక్ మార్కెట్ అక్రమాలలో ప్రధానమైనది. అన్నపేరుతో నడిచే కంపెనీల నుంచి తమ్ముడి కంపెనీల షేర్లలో అక్రమ నిధుల బట్వాడా జరిగిందనేది. దాన్ని భారత స్టాక్ మార్కెట్ పరిభాషలో రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్ (సంబంధిత వ్యక్తుల లావాదేవీలు) అంటారు. ఇతర లావాదేవీలు స్టాక్ మార్కెట్ వ్యాపారాన్ని తారుమారు చేసే అక్రమాలతో నింపే అవకాశం ఉంది, అందువల్ల ఆ లావాదేవీలను నియంత్రించడానికి, అడ్డుకోవడానికి, ఆంక్షలు విధించడానికి స్వతంత్ర సంస్థ అవసరమనే భావనతో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) అనే నియంత్రణ సంస్థ ఏర్పడింది. భారత పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడిన ఈ చట్టబద్ధ సంస్థ కర్తవ్యం ప్రజల తరపున చిన్న మధ్యతరగతి మదుపుదారుల ప్రయోజనాలను రక్షించడం. స్టాక్ మార్కెట్ దిగ్గజాలు, కారెన్సీ సంస్థలు, సంపన్నులు తమ ఆర్థిక బలాన్ని ఉపయోగించి స్టాక్ మార్కెట్‌ను అల్లకల్లోలం చేయకుండా, చిన్న మదుపుదార్ల సంపదను కొల్లగొట్టకుండా చూడడం. కానీ ఆ కంచె దొంగ గొడ్ల మేతను చూసిచూడనట్టు ప్రవర్తిస్తున్నదని 2023 జనవరి హిండెన్ బర్గ్ నివేదిక ఆ గొడ్లు ఎక్కడ ఎట్లా మేషాయో చూపించింది. అప్పటికి ఇంకా చేసును కాపాడవలసిన కంచె ఎందుకు కాపాడకుండా ఉండిపోయింది. అనే అమాయక ప్రశ్న దగ్గరికి మాత్రమే చేరాం. సంపద ఎక్కడి నుంచి వచ్చిందో, సక్రమ మార్గాల్లో వచ్చిందో, అక్రమ మార్గాలలో చెప్పనక్కర్లేని, పన్నులు చెల్లించలేని, పన్ను రహిత దేశాలలో డొల్లకంపెనీలు పెట్టిన అన్న భారతదేశంలోని తమ్ముడి కంపెనీ షేర్లు కొని, కొన్నట్టుగా నటించి మాయచేస్తుంటే పట్టుకోవలసిన సంస్థ ఎందుకు పట్టుకోలేదు అని అప్పటి ప్రశ్న. ఆ నివేదిక బైటపడగానే దేశంలో వ్యవస్థల విధ్వంస చిహ్నాలు మరొకసారి బైటపడడం మొదలయింది. సంస్థ తన తప్పును ఒప్పుకోకపోగా బుకాయింపులు మొదలుపెట్టింది. మసిపూసి మారేడుకాయ చేసిన రెండు నివేదికలనూ సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ మధ్యలో అధికారికంగా ప్రభుత్వ సంస్థలూ, అనధికారికంగా సంఘ్ పరివార్ సంస్థలూ గౌతమ్ అదానికి రక్షణ కావచాలు తయారు చేశాయి. ఆ ప్రహసనం ఒక వైపు సాగిస్తూనే, మరొకవైపు హిండెన్ బర్గ్ పరిశోధనా సంస్థకే సంజాయిషీ నోటీసులూ, బోనెక్కించే ప్రయత్నాలూ, బెదిరింపులూ సాగుతాయి. మహా ఘనత వహించిన భారత ప్రభుత్వ వ్యవస్థలు. ఈ తాటాకు చప్పుళ్లకు బెదరని హిండెన్ బర్గ్ తన పరిశోధనలు కొనసాగించి తీగ లాగుతూ డొంకలో ప్రవేశించింది. అసలు కంచెకే దొంగతనంలో భాగం ఉందని సాక్ష్యాధారాలు సంపాదించి, ఈ ఆగస్టులో మరొక నివేదిక విడుదల చేసింది. ఈ కొత్త నివేదిక భారత ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రధానమైన నియంత్రణ యంత్రాంగపు అత్యున్నతాధికారులు ఎట్లా అదానీ ప్రయోజనాలు రక్షించడానికి, పనిలో పనిగా తమ పనులు చక్కబెట్టుకోవడానికి పని చేస్తున్నారో చూపించారు. ఈ ఏడాదిన్నర కింద బైటపెట్టిన ఆర్థిక అరాచకత్వాన్ని, అవినీతిని, మహా కుంభకోణాన్ని, అంతిమంగా భారత ప్రజల సంపద లూటీని ప్రభుత్వమూ, ప్రభుత్వ పక్షమూ, దాని పరివారమూ, అధికార వ్యవస్థలూ పెంచి పోషిస్తున్నాయో చూపెట్టింది. హిందూ ఐక్యత, దేశభక్తి, దేశాన్ని శక్తిమంతం చేయడం అనే ముసుగులతో సంఘ్ పరివార్ అసలు లక్ష్యం దేశ సంపదలను అంతకంతకు ఎక్కువగా కేంద్రీకృతం చేయడం, పిడికెడు మంది ప్రయోజనాల కోసం నూతన నలభై కోట్ల ప్రజల ప్రయోజనాలను బలిపెట్టడం. సమాజం మీద, సంపద మీద, సంపద మీద కొద్ది మంది అధికారాన్ని స్థాపించే, బలపరిచే విష విద్వేష విభజన వ్యూహం అది. మనుస్మృతి, వర్ణాశ్రమ ధర్మం, హిందుత్వ బ్రాహ్మణీయ ఫాసిజం కోరుకునే వ్యవస్థ అది. దానికి సామ్రాజ్యవాద దళారీ షోకులు అడ్డుకుంటున్న పాలన ఇది. తెల్లవారి లేస్తే ఇడి, సిబిఐ అంటూ హడావుడి చేసేవారు కన్నడంలో దొంగలా దొరికిన అదానీ గ్రూపు అవినీతిని ఎందుకు విస్మరిస్తున్నట్టు? అదానీ గ్రూప్ షేర్ల మాయాజాలం ఎన్నికల ముందు హిడెన్ బర్గ్ నివేదిక వచ్చింది. విచారణ జరిపించాలని ఎంతగా కోరినా, పార్లమెంటు స్తంభించిపోయినా మోడీ సర్కారులో చలనం రాలేదు. సుప్రీం కోర్టు కూడా 'సెబి'కి అప్పగించి వారి నివేదికతో సరిపెట్టింది. కానీ ఇప్పటికీ పూర్తి విచారణ జరిపి అన్నీ బయటపెట్టింది లేదు. ఈలోగా అన్నీ సర్దుబాటు చేసుకున్న అదానీ కంపెనీ వ్యాపారాలు వాటాల అమ్మకం మళ్లీ ఊపందుకున్నట్టు కథనాలు వచ్చాయంటే అంతా ఏలినవారి చలవే. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈమధ్య కాలంలో అదానీ ఆయన ప్రతినిధిగా పలు చర్చలు జరిపి కొత్తగా ఒప్పందాలు చేసుకున్నారు. గతంలో అదానీ అక్రమంగా రుణాలు సేకరించిన సాంకేతికతనీ, షేర్ల మాయాజాలం చేసిందనీ ఆరోపణలు వచ్చినపుడు కూడా ఇలాంటి వాదనలతోనూ సమర్థనలతోనూ సరిపెట్టారు. ఇప్పుడు ఈ వాదనలన్నీ కూడా అటే నడుస్తున్నట్టు కనిపిస్తున్నాయి. దాని వల్ల కూడా దేశానికి నష్టమే, ఎందుకంటే తప్పు చేసిన వాళ్ల పేర్లు బయటపెట్టకుండా కప్పిపుచ్చడమంటే బ్లాక్‌మెయిల్ చేయడానికి అవకాశం, దాని వల్ల మన ప్రయోజనాలు బలిపెట్టి తమ స్వార్థం సాగించుకోవడం జరగొచ్చు. కనుకనే దీన్ని ఇంతటితో వదలిపెట్టడం ప్రమాదకరం. సమగ్రమైన దర్యాప్తు జరిపి దోషులను శిక్షించడంతో పాటు వ్యవస్థలో లొసుగులు చక్కదిద్దడం అవసరం. శ్రీలంక, కెనడా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ వంటి దేశాల ప్రభుత్వాలు అదానీ ఒప్పందాలు రద్దు చేయడం, తనిఖీ చేయడం చూస్తున్నాం గానీ స్వదేశంలో మాత్రం ఆయన అక్రమాలు నల్లేరుమీద బండిలా నడిచిపోతున్నాయి. అయితే మోడీ సర్కారు కూడా ఎల్లకాలం అవినీతి కొండ చిలువలను కాపాడలేదనేది స్పష్టం. దీన్ని అర్థం చేసుకోవడానికి, అశేష ప్రజానీకానికి అర్థం చేసుకోడానికి ఇంకా ఎన్ని రహస్యాలు కావాలి?.

# హంద్రీ నీవా, గాలేరు నగరి పనులపై విజిలెన్స్ విచారణ

చిత్తూరు : హంద్రీ నీవా, గాలేరు నగరి సుజల స్రవంతి పథకాల అనుసంధాన పనులపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. గత ప్రభుత్వంలో కొందరు ఇంజనీర్లు అంతా ఏకపక్షంగా అవినీతి, అక్రమాలను అండగా నిలిచారని అభియోగాలు ఉన్నాయి.ప్రభుత్వం అండతో కొందరు అవకతవకల విషయంలో కీలకపాత్ర పోషించారని ఫిర్యాదులు అందాయి. డిపిఆర్ పూర్తిస్థాయిలో లేకుండానే టెండర్లు పిలవడం కూడా వివాదాస్పదమైంది. బిల్లులు కూడా ఇష్టారాజ్యంగా చెల్లించారని ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు నిబంధనలకు విరుద్ధంగా ఆయాచితంగా లబ్ధి చేకూర్చాలని అబియోగాలు ఉన్నాయి.పనుల్లోని లోటుపాట్లను వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వం నుంచి నిఘా విభాగం అధికార యంత్రంగానికి ఉత్తర్వులు అందాయి. సమగ్ర వివరాలు సమర్పించాలని గాలేరు నగరి జల స్రవంతి ఎస్ఇని ప్రభుత్వం కోరింది. ఏ ఏ వివరాల కావాలో రెండు పేజీలలో ప్రశ్నలను సంధించడంతో ఇంజనీర్లలో ఆందోళన ప్రారంభమయ్యింది.గాలేరో నగరి సుజల స్రవంతి పథకం నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి కృష్ణా జలాలను తరలించాలని చక్రాయపేట ఎత్తిపోతల పథకానికి వైసీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాయలసీమ కరువు నివారణ పథకం కింద పనులు చేపట్టడానికి పచ్చజెండా ఊపింది.2020 ఆగస్టు 26న 5,036 కోట్ల రూపాయలతో పరిపాలన ఆమోదం ఇవ్వగా, అదే ఏడాది నవంబర్ 9న సాంకేతిక అనుమతులను ఇచ్చింది. అనంతరం నీటిపారుదల శాఖ ఇంజనీర్లు టెండర్లు పిలిచారు. పనులు దక్కించుకున్న పి ఎల్ ఆర్ ప్రాజెక్టు సంస్థ, నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ సంయుక్త గుత్తేదారు సంస్థతో 2021 మార్చి 30న 4,374 కోట్లకు ఒప్పందం కుదిరింది.వాస్తవంగా పనులు ఈ ఏడాది మార్చి 19 తేదీల్లోగా పూర్తవ్వాలని ఒప్పందంలో గడువు విధించారు. ఒప్పందంలోపు కనీసం 25 శాతం పనులు కూడా పూర్తికాలేదు. ఇప్పటికీ 20.68 శాతం పనులు పూర్తి అయ్యాయని అంచనా. ఇప్పటివరకు 1,050 కోట్ల రూపాయల పనులు జరిగాయి. ఈ పథకం కింద పది ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టాలని రూపకల్పన చేశారు.మూడు చోట్ల పనులు చేపట్టగా మరో ఏడింటి పనులకు సంబంధించిన ఆకృతులకు పూర్తిస్థాయిలో ఇప్పతవరకు ఆమోదం లభించలేదు. నీటిని తరలించడానికి 120 కిలోమీటర్ల మేర పైపులైను వేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 65 కిలోమీటర్లు మాత్రమే వేశారు. వేంపల్లి శివారులో గాలేరు నగారి కాలువ 55.680 కిలోమీటర్ల నుంచి కృష్ణా జనాలు 20 టీఎంసీలను తరలించాలి.వైఎస్ఆర్ అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో 2.91 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. నీటిని ఎత్తిపోసే కీలకమైన పనుల్లో పెద్దగా పురోగతి లేదు. ఇంతవరకు భూసేకరణ ప్రక్రియ కూడా పూర్తికాలేదు. అడవి శాఖ నుంచి పర్యావరణ అనుమతులు కూడా తీసుకోలేదు. పంపు హౌస్ ల నిర్మాణం, మోటర్లు, పంపుల ఏర్పాటు, అనుసంధాన కాలువ, సొరంగం తవ్వకం, పైపులైన్ల పనులు నత్త నడకన సాగుతున్నాయి.కాలేటి వాగు సామర్థ్యం 0.226 టీఎంసీలు కాగా, 1.20 టిఎంసిలు నీటిని నిల్వ చేసేందుకు



పనుల చేపట్టారు. ఇందులోకి కృష్ణాజిల్లాలు చేరాలంటే ఎత్తిపోతల పథకం ప్రారంభంలో పనులు పూర్తికావాలి. అక్కడ జరుగుతున్న పనులు తీరుతెన్నులు చుస్తే, ఇప్పట్లో పూర్తి అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. కాలేటి వాగులోకి కృష్ణ జలాల్లో చేరే పరిస్థితి లేదు. మొగమేరుపై జలవారిది నిర్మాణాన్ని చేపట్టి మధ్యలోనే నిలిపేశారు.

మిగతా పనులు కూడా ఎక్కడికక్కడే అసంపూర్తిగా ఉన్నాయి. గాలేరు నగరి హంద్రీనీవా పనుల అనుసంధానంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలని విజిలెన్స్ అధికారులు నిర్ణయించారు. ఎందుకు 24 ప్రశ్నలు తయారు చేసి, సమగ్ర సమాచారం ఇవ్వాలని ఎస్ఇకి లేఖ రాశారు.బేసిక్ డేటా, పరిపాలన సాంకేతిక అనుమతి పత్రాలు, ఐబిఎం అంచనాలు, కృష్ణా జలాలు తరలించడానికి ఇచ్చిన ఆమోదపత్రాలు, టెండరు ప్రతులు, మట్టి తవ్వకం, గుత్తేదారు సంస్థతో జరిగిన ఒప్పంద పత్రాలు, బిల్లుల చెల్లింపు షెడ్యూలు, మట్టి, రాతిపొరలు, బోర్ల తోవ్వకం, పరీక్షల ఫలితాలు, సిమెంట్ కాంక్రీట్ నిర్మాణాలు, సమగ్ర పథక నివేదిక (డిపిఅర్), స్టేజి 1,2 పనుల ఎం బుక్స్, కాలేటి వాగు పనులు, మహదేవపల్లి, గొట్లమిట్ట, వరికుంటపల్లి, సురభి, గడ్డంవారి పల్లి, లక్కిరెడ్డిపల్లి, కోనంపేట, గండి, కల్లూరివారి పల్లి, పెద్దేరు, నాయుడువారి పల్లి చెరువుల సామర్థ్యం, ఇతర అభివృద్ధి చేయాల్సిన సమాచారం, 10 ఎత్తిపోతల పథకాల పంపు హౌస్ లు, పైపులైన్ల పొడవు, చుట్టుకొలత, మంధం, కొనుగోలు బిల్లులు, క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు, నిపుణులు తనిఖీ నివేదికలు, మోటార్ల కొనుగోలు, కాలువ, సొరంగాలు, జలాశయాల్లో తవ్వకాలు, భూ భౌగోళిక పరిస్థితులు, హైడ్రాలిక్ సమాచారం, మట్టి, ఇసుక, ఇతర సామాగ్రి ఏ క్వారీ తీసుకుని వచ్చారు? రాయల్టీ చెల్లింపు పత్రాలు, పనులపై నాణ్యతా నియంత్రణ విభాగం ఇంజనీర్లు ఇచ్చిన నివేదికలు సమర్పించాలని కోరారు.అప్పట్లో కొందరు ఇంజనీర్లు ఏకపక్షంగా వ్యవహారం నడిపారని తెలుస్తుంది. ప్రభుత్వంలో పెద్దల అండతో కొందరు నియమ నిబంధనలు పాటించలేదని విమర్శలు ఉన్నాయి. డిపిఆర్ పూర్తిస్థాయిలో లేకుండానే టెండర్లు పిలవడం కూడా వివాదాస్పదమైంది. బిల్లులు కూడా ఇష్టారాజ్యంగా చెల్లించాలని ఆరోపణలు ప్రభుత్వానికి అందాయి. వీటిని నిగ్గు తేల్చడానికి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. విచారణలో మరిన్ని ఆశక్తికర విషయాలు వెలుగులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# 2024 డిసెంబర్ విమానయానాలకు చీకటి నెల

న్యూఢిల్లీ,2024 ముగింపునకు చేరింది మరికొన్ని గంటల్లో కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రపంచం మొత్తం సిద్ధమవుతోంది. అయితే, ఏడాది చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో 'చీకటి నెల'గా నిలిచింది. ఎందుకంటే డిసెంబర్ నెలలో ఏకంగా ఏడు ఘోరమైన విమాన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మొత్తం ఏడు ప్రధాన ఘటనల్లో ఏకంగా 240 మంది మరణించడం కలచివేస్తోంది. ఈ ఒక్క నెలలో జరిగిన విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై పలు ప్రశ్నల్ని లేవనెతుతున్నాయి. దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు. డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్‌గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు.

డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు.. 19 మంది మృతి

డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగా.. వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది. ఇక అదే రోజుటర్కీలో కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో డిసెంబర్ 22 ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. డిసెంబర్ 22న పాపువా న్యూ గునియాలో నార్త్ కోస్ట్ ఏవియేషన్ నిర్వహిస్తున్న చిన్న విమానం కూలి అందులో ఉన్న 5 మంది ప్రాణాలు కోల్పోయారు.

# లైంగిక దాడి ఘటన నేపథ్యంలో గవర్నర్‌ను కలిసిన నటుడు విజయ్

చెన్నై, అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి ఘటన తమిళనాడులో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. వివిధ పార్టీలు, సంఘాలు అన్నా యూనివర్సిటీ ముందు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఘటనకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ తమిళగ వెట్రి కజగమ్ పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని కలిశారు. రాష్ట్రంలోని పరిస్థితుల నేపథ్యంలో లైంగిక దాడి ఘటనపై మాట్లాడేందుకే విజయ్ గవర్నర్‌ను కలిసినట్లు తెలుస్తోంది. అయితే నటుడు విజయ్ ఈ లైంగిక దాడి ఘటనపై ఇప్పటికే స్పందించారు. అన్నా యూనివర్సిటీ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, చాలా బాధించిందని నటుడు విజయ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారని, నిందితుడిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాను ప్రభుత్వాన్ని కోరానని, ఈ ఘటనలో ఇంకా ఎవరి హస్తమున్నా తగిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశానని ఆయన తన పోస్టులో తెలిపారు.

# పాదాలు తాకితే పనులు జరగవు

న్యూఢిల్లీ,ప్రజలకు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ కీలక విజ్ఞప్తి చేశారు. పాదాలను తాకడంపై నిషేధం ఉందని.. అలా చేసిన వారికి పనులు అప్పగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మధ్యప్రదేశ్‌లోని తికమ్‌గఢ్ లోగల తన కార్యాలయం వద్ద వినూత్న బోర్డు ఏర్పాటు చేశారు. 'పాదాలను తాకడంపై నిషేధం ఉంది. అలా చేసిన వారికి ఎటువంటి పనులూ అప్పగించేది లేదు' అంటూ పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఇది చూసిన స్థానిక ప్రజలు, రాజకీయ నేతలు షాక్ అవుతున్నారు. కార్యాలయం వద్దకు వచ్చిన వారంతా ఈ బోర్డును ఆసక్తిగా తిలకిస్తున్నారు. కేంద్ర మంత్రి చేసిన ఈ పనిని ప్రశంసిస్తున్నారు. కాగా, వీరేంద్ర కుమార్‌కు స్థానికంగా ఓటమి ఎరుగని నాయకుడిగా పేరుంది. ఆయన 1996లో తొలిసారి సాగర్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇక తికమ్‌గఢ్ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం నుంచి 2009లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2019లో ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇప్పుడు 2024లోనూ అదే విజయ పరంపర కొనసాగించారు. ప్రస్తుతం ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా పనిచేస్తున్నారు.

## మన్మోహన్‌సింగ్ అస్తికలను యమునా నదిలో కలిపిన కుటుంబ సభ్యులు

ఢిల్లీ, మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మరణించిన విషయం తెలిసిందే. ఈనెల 26న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో శనివారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. కేంద్రం అధికార లాంఛనాలతో ఆయనకు తుది వీడ్కోలు పలికింది. మన్మోహన్ పెద్ద కూతురు ఉపిందర్ సింగ్ తన తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తాజాగా మన్మోహన్ అస్తికలను కుటుంబ సభ్యులు యమునా నదిలో కలిపారు. మజ్జు కా తిలా గురుద్వారా సమీపంలోని అష్ట్ ఘాట్ వద్ద సిక్కు సంప్రదాయాలను అనుసరించి ఆదివారం ఆయన అస్తికలను నదిలో నిమజ్జనం చేశారు. మన్మోహన్ సింగ్ సతీమణి, ముగ్గురు కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో స్మారకాన్ని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనువైన స్థలాన్ని త్వరలోనే నిర్ణయిస్తామని పేర్కొన్నది. కాగా, స్మారక నిర్మాణం జరగనున్న స్థలంలోనే అంత్యక్రియలు జరపాలని అంతకుముందు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మన్మోహన్ అంత్యక్రియలు, స్మారకానికి స్థలాన్ని నిర్ణయించకుండా బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దేశ తొలి సిక్కు ప్రధానమంత్రిని అవమానిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

# మదర్ డెయిరీకి శరాఘాతం..




యాదగిరిగుట్ట, రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో లడ్డూలు, ఇతర ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని ఇకపై విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 1 నుండి విజయ నెయ్యిని అన్ని ఆలయాలు వినియోగించనున్నాయి.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ మదర్ డైయిరీకి ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. మదర్ డైయిరీకి ప్రధాన ఆదాయ వనరుగా యాదగిరిగుట్ట దేవస్థానానికి నెయ్యి విక్రయానికి బ్రేక్ పడుతోంది. మదర్ డైయిరీకి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉంది. ఇప్పటికే నష్టాల ఊబిలో కూరుకుపోయిన మదర్ డైయిరీకి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శరాఘాతంగా మారనుంది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం తెలంగాణ తిరుపతిగా విరాజిల్లుతోంది. ఆలయ పునర్నిర్మాణం తర్వాత స్వామివారి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారు. సాధారణ రోజుల్లో స్వామివారిని 30 వేల మంది భక్తులు దర్శించు కుంటున్నారు. శని ఆదివారాల్లో 50వేల మంది భక్తుల స్వామి వారిని దర్శించు కుంటున్నారు. తిరుపతి లడ్డు తర్వాత రుచి శుచిలో యాదగిరిగుట్ట స్వామి లడ్డును భక్తులు అమితంగా ఇష్టపడతారు. స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడు మహా ప్రసాదంగా భావించే యాదాద్రి లడ్డును కొనుగోలు చేస్తున్నారు. యాదగిరిగుట్ట ఆలయంలో ప్రతిరోజు 22వేల లడ్డూలను తయారు చేస్తున్నారు. ఈ లడ్డు తయారీకి ప్రభుత్వ రంగ సంస్థ మదర్ డైయిరీ నెయ్యిని వినియోగిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ లో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదం తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ అప్రమత్తమై రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో విజయ డైయిరీ నెయ్యిని కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి జనవరి 1నుంచి విజయ డెయిరీ నెయ్యి సరఫరా కానుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మదర్ డైయిరీ ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, చెర్వుగట్టుతో పాటు రాష్ట్రంలోని కీసర, వేములకొండ తదితర ఆలయాలకు కొన్నేళ్లుగా మదర్ డెయిరీ నెయ్యి సరఫరా చేస్తోంది. తద్వారా మదర్ డెయిరీకి ఏటా రూ.36 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇందులో ఒక్క యాదగిరిగుట్ట దేవస్థానం నెలకు 30 టన్నుల నెయ్యిని మదర్ డెయిరీ నుంచి కొనుగోలు చేస్తున్నారు. 35 ఏళ్లుగా మదర్ డైరీ నెయ్యిని వినియోగిస్తున్నామని, ఇందుకు గాను దేవస్థానం ఏటా రూ.18 కోట్ల వరకు చెల్లిస్తున్నామని ఆలయ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి ఒకటో తేదీ నుండి విజయ డైయిరీ నెయ్యిని వినియోగిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న మదర్ డైయిరీ.. ప్రభుత్వ నిర్ణయంతో మరింత చతికిలపడే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి నల్లగొండ– రంగారెడ్డి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న నార్ముల్ మదర్ డైయిరీలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన రైతులే ఉన్నారు. జిల్లాలో 24 చిల్లింగ్ సెంటర్లు ఉండగా, 435 సొసైటీల ద్వారా సుమారు 45 వేల మంది రైతులు రోజూ సగటున లక్ష లీటర్ల పాలు పోస్తున్నారు. మదర్ డైయిరీకి వేల లీటర్ల పాలు పోసి ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ గడిచిన 40 ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రైవేట్ డైయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చినా రైతులు మదర్ డైయిరీని కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంలో యాదగిరిగుట్ట, చెరువు గుట్టు దేవాలయాలను మినహాయించాలని రైతులు కోరుతున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి ప్రతి నెలా 30 టన్నుల నెయ్యి మదర్ డైయిరీ సరఫరా చేస్తుంది. ఇది డెయిరీకి అతిపెద్ద ఆదాయ వనరుగా ఉంది. లడ్డూ ప్రసాద తయారీలో వినియోగిస్తున్న మదర్ డైయిరీ నెయ్యి స్వచ్ఛమైనదేనని, ఎలాంటి కల్తీ లేదని స్టేట్ ఫుడ్ లేబొరేటరీ రిపోర్ట్ ఇచ్చింది. కాగా యాదగిరిగుట్టకు గత 40 ఏళ్లుగా మదర్ డెయిరీనే నెయ్యి సరఫరా చేస్తోంది. ఈ డెయిరీ కాంట్రాక్ట్ మార్చి 2025 వరకు ఉంది. ఈ నేపథ్యంలో గుట్టకు మదర్ డెయిరీ నెయ్యినే సరఫరా చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మదర్ డైయిరీలో యాదాద్రి జిల్లా రైతులే అత్యధికంగా ఉన్నారని, రైతుల ప్రయోజనం కాపాడేందుకు తాము ప్రయత్నిస్తున్నామని నేతలు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం నుంచి యాదగిరిగుట్టను మినహాయించేలా ప్రయత్నిస్తామని నేతలు చెబుతున్నారు.

# రైతుభరోసాపై కొలిక్కిరాని కసరత్తు

హైదరాబాద్, రైతుభరోసాపై ఇప్పటికీ ప్రభుత్వం వద్ద స్పష్టత కానరావడం లేదు. అసలుసిసలు రైతులకే భరోసా అని ప్రచారం చేస్తున్నా..అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వడం లేదు. ఏడాదైనా విధివిధానాలు రూపందించలేదు. భూమి ఉన్నంత మాత్రాన భరోసా ఇవ్వకుండా సన్నచిన్నకారు రైతులను గుర్తించి ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై భారం లేకుండా చేయాలి. సంక్రాంతి పండుగ తర్వాతే అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించగా.. దీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించినా విధివిధానాలపై స్పష్టత లేదు.సాగుభూమికే రైతు భరోసా ఇవ్వాలనే యోచనలో ఉన్న ప్రభుత్వం ఎన్ని ఎకరాల వరకూ అమలు చేయాలనే దానిపై ఓ స్పష్టతకు ఇంకా రానట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మరోసారి భేటీ అయ్యి చర్చించనుంది. అటు.. ట్యాక్స్ పేయర్స్, ప్రభుత్వ ఉద్యోగులను రైతు భరోసాకు అనర్హులుగా ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. గూగుల్ డేటా, శాటిలైట్ ఆధారంగా సాగు విస్తీర్ణం లెక్కించేందుకు పలు కంపెనీల నుంచి సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. సచివాలయంలో రైతు భరోసాపై ఆదివారం సబ్ కమిటీ భేటీ అయ్యింది. కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, కమిటీ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. రైతు భరోసా ఇచ్చేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. రానున్న యాసంగి పంటకు రైతు భరోసా అందించేందుకు ఖరారు చేయాల్సిన విధి విధానాలపై మంత్రులు కసరత్తు చేశారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకూ రైతు భరోసా అందించిన తీరు.. క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన క్రమంలో రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, అధికారులు సేకరించిన సమాచారంపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే, రైతు భరోసా విధి విధానాలపై మరోసారి భేటీ కావాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారమే ముందుకు వెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 'ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇచ్చి తీరుతాం. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రభుత్వం రూ. 72,659 కోట్లు కేటాయించింది. రైతు రుణ మాఫీ కింద 2 నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్ల నగదును రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా రైతుల సంక్షేమానికి కృషి చేసేందుకు వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశాం. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతువేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని నిర్ణయించారు.110 రైతు వేదికల్లో రూ.4 కోట్లకు పైగా నిధులు వెచ్చించి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేశారు.




పంటల బీమా పథకం కింద ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రైతుల పక్షాన చెల్లిస్తుంది. ఈ ఏడాది లక్ష ఎకరాల ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2023 – 24 ఏడాదికి ఆయిల్ సాగు పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ. 80. 10 కోట్లు విడుదల చేయగా.. రాష్ట్ర వాటా కలుపుకొని మొత్తంగా రూ.133.5 కోట్లు విడుదల చేశాం. రైతుల నుంచి కొనుగోలు చేసే సన్నధాన్యానికి 500 బోనస్ ప్రకటించారు. అయితే రైతులకు ఇకముందు రుణమాఫీలు లేకుండా స్పష్టమైన వ్యవసాయ విధానలతో ముందుకు సాగాల్సి ఉంది. ఇకపోతే ఖరీఫ్ రైతులకు తెలంగాణ ప్రభుత్వం చేదు వార్త వినిపించింది. ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వబోమని తెలిపింది. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. రైతు భరోసాకు బదులుగా ప్రతీ సన్న ధాన్యం పండించిన రైతుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని తుమ్మల ప్రకటించారు. పంట వేసిన రైతుకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా ఆయన తెలిపారు. వ్యవసాయం చేయని వారికి రైతు భరోసా ఇవ్వబోమని తేల్చి చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వలేము. మార్పులకు అనుగుణంగా రైతులను మారుస్తాం. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా ముఖ్యమంత్రి రుణమాఫీ అంశాన్ని తన భుజాన వేసుకున్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో 70 వేల కోట్ల రుణమాఫీ చేశారు. పంటల బీమా గతంలో లేకపోయినప్పటికీ ఇప్పుడు రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతీ రైతు పంటకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని, రాష్ట్రంలో పండే అన్ని పంటలను ఎంఎస్పీ ప్రకారమే కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన అన్ని పంటలను కేంద్రం కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అయితే వ్యవసాయ రంగం, రైతుల విషయంలో కాంగ్రెస్ చేసిన వాగ్దానాలు అమలు చేసితీరుతామన్నారు.

# ప్రజలను ఆకట్టుకునేందుకు కేజ్రీవాల్ విశ్వ ప్రయత్నాలు



ఢిల్లీ,ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజలను ఆకట్టుకునేందుకు కీలక హామీలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కీలక ప్రకటన చేశారు. ఆలయాలు, గురుద్వారాల్లో పనిచేసే పూజారులు, గ్రంథీలకు కేజ్రీ వరాల జల్లు కురిపించారు. తాము అధికారంలోకి వస్తే.. వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందజేస్తామని ప్రకటించారు. సోమవారం కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ.. 'పురోహితులు, గ్రంథీలు మన ఆచారాలను భవిష్యత్తు తరాలకు అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సమాజానికి వారు నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోవడం లేదు. మేం అధికారంలోకి వస్తే వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందిస్తాం' అని కేజ్రీవాల్ అన్నారు. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రేపటి నుంచే ప్రారంభం అవుతుందని కేజ్రీ వెల్లడించారు. హనుమాన్ ఆలయంలో తానే స్వయంగా ఈ ప్రక్రియను ప్రారంభిస్తానని తెలిపారు. ఈ ప్రక్రియకు అడ్డుపడొద్దని ఈ సందర్భం గా బీజేపీని కేజ్రీ అభ్యర్థించారు. 'రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అడ్డంకులు సృష్టించవద్దని నేను బీజేపీని అభ్యర్థిస్తున్నాను. దీన్ని అడ్డుకోవడం పాపం చేసినట్లే అవుతుంది' అని వ్యాఖ్యానించారు.

# ఊరిస్తున్న మంత్రివర్గ విస్తరణ..



హైదరాబాద్,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నది. తర్వాత మంత్రి వర్గ విస్తరణ రేపుమాపు ఉంటుందంటూ ఏడాదికాలంగా వినిపిస్తున్నా..ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా లేదు. ఢిల్లీకి ఎన్ని చక్కర్లు కొట్టినా సిఎం రేవంత్‌కు మోక్షం కలగడం లేదు. ఆయన అభ్యర్థనలను అధినేతలు పట్టించుకోవడం లేదు. మంత్రి పదవిపై ఎమ్మెల్యేలు ఎన్నో ఆశలు పెట్టుకోగా.. సాగదీత పరిస్థితిలో రోజుకొకరు తెర మీదకు వస్తున్నారు. రేసులో నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారు.త్వరలో మంత్రివర్గ విస్తరణ అంటూ వార్తలు వస్తుండడం..టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకోవడం గమనార్హం.మంత్రి పదవిని ఆశిస్తున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు తీవ్రంగా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిగా ఇదే విషయమై ఢిల్లీ దాకా పైరవీలు చేస్తున్నారు. రోజుకొకరు తెర మీదికి వచ్చి మంత్రి పదవిని ఆశిస్తున్న నేపథ్యంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్నది. ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆశించడం తప్పేం కాదన్నట్లుగా ఏఐసీసీ దాకా మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో మొదటి జాబితాలోనే పేరున్న వారిలో ఈ కొత్త పరిణామాలు ఒకింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి. చూస్తుండగానే ఏడాది కాలం కరిగి పోయింది. మంత్రి పదవిని ఆశిస్తున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు తీవ్రంగా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిగా ఇదే విషయమై ఢిల్లీ దాకా పైరవీలు చేస్తున్నారు. రోజుకొకరు తెర మీదికి వచ్చి మంత్రి పదవిని ఆశిస్తున్న నేపథ్యంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్నది. ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది.ఆశించడం తప్పేం కాదన్నట్లుగా ఏఐసీసీ దాకా మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో మొదటి జాబితాలోనే పేరున్న వారిలో ఈ కొత్త పరిణామాలు ఒకింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి. చూస్తుండగానే ఏడాది కాలం కరిగి పోయింది. ప్రభుత్వం వస్తే పదవి గ్యారంటీ అని కొందరు మొదట్నుంచి ఆశిస్తూ వస్తున్నారు. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితి ఇప్పుడు ఎదురవుతోంది. ఏకంగా దళిత సామాజిక వర్గం కోటాలో మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు కొందరు చెప్పుకుంటున్నాయి. ఇలా ఎవరికి వారు మంత్రి పదవి కోసం తలబడుతుండడంతో రాజకీయం రసవత్తరం గా మారింది. 2024 సంక్రాంతి నుంచి మొదలైన ఈ పోటీ 2025 సంక్రాంతి వస్తున్నా ముగింపు కార్డు మాత్రం పడలేదు. 2023, డిసెంబర్ 7న పది మంది మంత్రులతో కలిసి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తదనంతరం రేపు మాపు అంటూ వాయిదాలు మినహా ఆశావహులకు భరోసా దక్కడం లేదు. ఇకపోతే మంత్రివర్గంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికీ అమాత్యయోగం కలుగలేదు. దీంతో ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కులేకుండా పోయింది. నలుగురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఎవరికీ మంత్రివర్గంలో స్థానం లభించలేదు. అసలు మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా అనేది జవాబు లేని ప్రశ్నగా మిగిలింది. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్ రెడ్డికే మంత్రి యోగం తథ్యమన్న సంకేతాలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయి. పెద్దాయనకే అమాత్య యోగం దక్కుతుందని అంతా అనుకుంటున్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమేనంటూ సుదర్శన్ రెడ్డి కూడా అనేక సందర్భాల్లో చెప్పుకుంటున్నప్పటికీ ఎప్పుడన్నది తెలియడంలేదు. ఏ పదవీ లేకుండానే ఎమ్మెల్యేగానే కొనసాగుతుండడంతో జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేకు సైతం మింగుడు పడటం లేదు. శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలోనే ఇదే తనకు చివరి ఎన్నికలుగా సుదర్శన్ రెడ్డి ప్రకటించుకున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వాస్తవానికి సుదర్శన్ రెడ్డికి ఎవ్వరూ పోటీలేరు. గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల్లో సీనియారిటీ, కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఆయనకే అర్హతలు ఉన్నాయి. అయినప్పటికీ మంత్రి పదవి విషయంలో మాజీమంత్రికి అవకాశం దక్కడం లేదు. కొద్ది కాలం క్రితం వరకు మంత్రి పదవి వచ్చేస్తుందనుకుని ఆయన కొంత దూకుడు ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమీక్షలు, సమావేశాలు నిర్వహించి హల్‌చల్ చేశారు. తీరా మంత్రి వర్గ విస్తరణలో జాప్యంతో కినుక వహించి అంటి ముట్టనట్లుగానే ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుదర్శన్ రెడ్డి అనుచరవర్గం సైతం ఈ విషయంలో ఒకింత అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలో బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో భూపతి రెడ్డి తొలిసారి చట్ట సభకు ఎన్నికయ్యారు. గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉన్నప్పటికీ ఇప్పుడు నేరుగా శాసనసభలో అడుగు పెట్టారు. ఇక బోధన్ నుంచి సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు నేతలు మంత్రి పదవి కోసం విన్నపాలు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. కామారెడ్డి జిల్లా నుంచి ఎల్లారెడ్డి, జుక్కల్ శాసనసభ్యులు ఇరువురు తొలిసారి అసెంబ్లీకి ఎన్నుకోబడ్డారు. పీసీసీ చీఫ్‌గా పార్టీ పదవిని దక్కించుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ సైతం బీసీ కోటాలో మంత్రి పదవి అడిగినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. షబ్బీర్ అలీ సైతం తన చివరి రాజకీయ మజిలీలో మంత్రి యోగం కోసం మైనార్టీ కోటాలో పట్టుబడుతున్నాడు. మొత్తానికి ఉమ్మడి జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే మంత్రి పదవి కోసం కాంగ్రెస్‌లో భారీగా పోటీ నెలకొంది.

# అఖిలేష్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు



లక్నో, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికార నివాసం కింద శివలింగం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ కూడా తవ్వకాలు జరుపాలని ఆయన డిమాండ్ చేశారు. కొన్ని రోజుల కిందట సంభాల్‌లో మొఘల్ కాలం నాటి మసీదు సర్వే నేపథ్యంలో అల్లర్లు జరిగాయి. ఈ ఘర్షణలో పలువురు మరణించగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాత సంభాల్‌లో పలు చోట్ల తవ్వకాలతోపాటు ఇళ్ల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కాగా, అఖిలేష్ యాదవ్ సోమవారం దీని గురించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలు కప్పిపుచ్చడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి పలు ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతోందని ఆయన విమర్శించారు. అమాయకుల ఇళ్లను బుల్డోజర్లతో అక్రమంగా కూల్చివేస్తున్నారని ఆరోపించారు. 'సీఎం అధికార నివాసం కింద కూడా శివుడి రూపాన్ని సూచించే స్థూపాకార శివలింగం ఉందని మేం భావిస్తున్నాం. అక్కడ కూడా తవ్వకాలు జరుపాలి' అని అన్నారు. మరోవైపు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం శివలింగం గురించి ఇలా మాట్లాడటం సిగ్గుచేటని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు.

# జమిలి ఎన్నికల కోసం వైకాపాలో తొందర

అమరావతి, సమిలి ఎన్నికలు త్వరగా రావాలని మోడీకన్నా..జగనే ఎక్కువగా కోరుకుంటున్నారు. ఎంత త్వరరగా ఎన్నికలు వస్తే తాను అంత త్వరగా సిఎం అయిపోతానని కలలు కంటున్నారు. అందుకే విద్యుత్ ఉద్యమంతో అడుగులు వేశారు. ఈప్రభుత్వంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని విమర్శలకు పదును పెట్టారు. సమిలి ఎన్నికలు వస్తే కూటామి ప్రభుత్వం కూలి పోవడం ఖాయమని పార్టీ నేతలు బహిరంగంగానే ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి కేవలం ఆరు నెలలు మాత్రమే అయ్యింది. చేసిన అప్పులను,తప్పులను వెలికి తీసే ప్రయత్నంలో గత వైకాపా అవినీతి భారీగా బయటపడుతోంది. ఈ క్రమంలో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో ఘోర పరాజయం తర్వాత మరో యుద్ధానికి సిద్ధం కావాలంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మళ్లీ శాసనసభ ఎన్నికలకు నాలుగున్నరేళ్ల సమయం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం దాదాపు మరో ఏడాది సమయం ఉంది. ప్రస్తుతం ఎన్నికల సమయం కాకపోయినా ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైసిపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జగన్ అడుగులు వేస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి చేసుకున్న క్రమంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల విశ్వాసం కోల్పోయిందని విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు చర్చ జరుగుతున్న వేళ వైసీపీ నేతలు మాత్రం ప్రభుత్వంపై విమర్శలతో ముందుకు సాగుతున్నారు. ఓ వైపు విద్యుత్ రంగం దివాళా, బియ్యం కుంభకోణం వంటివన్నీ బయటపడుతున్నాయి. ఆనాటి మంత్రుల అవనితి తన్నుకు వస్తోంది. ఈ క్రమంలో వైసీపీ సీనియర్లు ఒక్కొక్కరు వైసీపీకి గుడ్‌బై చెబుతున్నారు. వలసలను నివారించడంలో జగన్ విఫలమయ్యారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు.. వారిని చురుకుగా ఉంచేసేదుకు జగన్ తన వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. లడ్డూ వివాదంతో జగన్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిన తరవాత ఇప్పుడు విద్యుత్ కొనుగోళ్లు, బియ్యం దాటించడం వంటి కుంభకోణాలు వెన్నాడుతున్నాయి. దీని నుంచి బయటకు వచ్చేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు విశ్వ



ప్రయత్నాలు చేశారు. త్రలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేసేందుకు జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. వరదల సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును, సహాయక చర్యలను రాష్ట్రం మొత్తం ప్రశంసిస్తే జగన్ మాత్రం ఇప్పటికీ విమర్శిస్తూనే ఉన్నారు. అసత్య ఆరోపణలు చేయడం ద్వారా జగన్ తన ఇమేజ్‌ను మరింత దిగజార్చుకుంటున్నారు. ఆరు నెలలు కాకుండానే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడం ద్వారా జగన్ తొందరపడుతున్నారు.ప్రభుత్వ పాలన నచ్చకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన తీర్పునిస్తారు. విపక్షాలు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. అందుకేనేమో జమిలితో కూటమి మఠాష్ అన్న రీతిలో నేతలు ప్రచారం చేసుకుంటున్నారు.

### తెలంగాలో పదిమంది ఐపిఎస్‌ల బదిలీ

హైదరాబాద్, తెలంగాణలో 10 మంది ఐపీఎస్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ ఆఫీసర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని భువనగిరి ఏఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, ఆసిఫాబాద్ ఏఎస్పీగా చిత్తరంజన్, కామారెడ్డి ఏఎస్పీగా బొక్కా చైతన్య, జనగామ ఏఎస్పీగా పందిరే చైతన్య రెడ్డి, భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్, కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా నగ్రాలే శుభం ప్రకాశ్, నిర్మల్ ఏఎస్పీగా రాజేశ్ మీనా, దేవరకొండ

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com